

మీ కళ్లెదుట ప్రమాదం జరిగిందా?



- వివరాలు 8లో -

తుపాను చలిగాలులు

వణుకుతున్న జిల్లా

మరో రెండు రోజులూ ఇలాగే

నేడు, రేపు భారీ వర్ష సూచన



తుపాను హెచ్చరిక నేపథ్యంలో జిల్లాను చలిగాలులు ముట్టడించాయి. పగలు కూడా చీకటిగా మారి చలి వణికిస్తోంది. మంగళవారం కనిష్ట ఉష్ణోగ్రత 21 డిగ్రీలకు పడిపోయింది. పగటి సమయంలో గరిష్ట ఉష్ణోగ్రత 26 డిగ్రీలుగా నమోదైంది. ఫెంగల్ తుపానుతో గత నెలాఖరులో జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురిసిన సంగతి తెలిసిందే. పది రోజుల తేడాతో మరో వాయుగుండం ఏర్పడి తుఫానుగా మారింది. అప్పుడు కూడా రెండు రోజుల పాటు భారీ వర్షాలు జిల్లాను ముంచెత్తాయి. ఇపుడు మళ్ళీ వాయుగుండం ఏర్పడడంతో సోమవారం నుంచే జిల్లాలో మబ్బులు కమ్ముకున్నాయి. చలిగాలులు వీస్తున్నాయి. మంగళవారం తీవ్రత మరింత పెరిగింది. రానున్న రెండు రోజుల పాటు ఉష్ణోగ్రతలు ఇదే విధంగా వుంటాయని వాతారణ శాఖ తెలియజేసింది. బుధవారం కనిష్ట ఉష్ణోగ్రత 22 డిగ్రీలు, గరిష్ట ఉష్ణోగ్రత 25 డిగ్రీలు వుంటుందని పేర్కొన్నారు. మరోవైపు బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో బుధ, గురు వారాల్లో జిల్లావ్యాప్తంగా తేలికపాటి నుంచీ మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశముందని హెచ్చరించింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ప్రాణం నిలిచింది!

25 ఏళ్ల యువకుడికి 50 ఏళ్ల వ్యక్తి గుండె అమర్చిన వైద్యులు

పద్మావతి హృదయాలయంలో విజయవంతంగా 17వ గుండె మార్పిడి శస్త్రచికిత్స



విమానం నుంచి అంబులెన్సులోకి గుండెను తీసుకొస్తున్న డాక్టర్లు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లాకు చెందిన 25 ఏళ్ల యువకుడికి.. విశాఖకు చెందిన 50 ఏళ్ల మురళి గుండెను మంగళవారం తిరుపతిలోని పద్మావతి హృదయాలయంలో వైద్యులు అమర్చారు. గుండె మార్పిడి శస్త్రచికిత్స అవసరమైన ఈ యువకుడు ఆరు నెలల కిందట ఇక్కడి వైద్యులను సంప్రదించారు. ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ ఆధ్వర్యంలో యువకుడికి అన్ని పరీక్షలు నిర్వహించి అతడి వివరాలను జీవన్‌దాన్ పోర్టల్‌లో నమోదు చేశారు. ఇక్కడ వైద్యం అందిస్తున్నారు. ఈ క్రమంలో విశాఖలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మురళికి బ్రెయిన్‌డెడ్ అయింది. అవయవదానానికి కుటుంబీకులు ముందుకు వచ్చారు. దీంతో మంగళవారం డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని కిమ్స్ ఆస్పత్రికి చేరుకొని ఉదయం 11 గంటల సమయంలో గుండె సేకరణను పూర్తి చేశారు. గ్రీన్‌ఛానల్ ద్వారా ప్రత్యేక విమానంలో రేణిగుంట విమానాశ్రయానికి.. అక్కడ్నుంచి ప్రత్యేక అంబులెన్సులో మధ్యాహ్నం 1.45 గంటలకు శ్రీపద్మావతి హృదయాలయానికి చేరుకున్నారు. దాదాపు 6 గంటల సేపు గుండె మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఇది 17వ గుండె మార్పిడి శస్త్ర చికిత్స. ఆ యువకుడిని ప్రత్యేక ఐసీయూ వార్డులో వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. మురళి కుటుంబ సభ్యులకు, గ్రీన్‌చానల్ ఏర్పాటు చేసిన పోలీసులకు వైద్య బృందం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.



సూళ్లూరుపేట మండలం దవాదిగుంటలోని తుపాను షెల్టరు

రెండు నెలలుగా ఒకదాని వెంట ఒకటిగా తుపానులు విరుచుకుపడుతున్నాయి. జిల్లాలో 75 కిలోమీటర్ల సముద్ర తీరం ఉంది. విశాలమైన పులికాట్ సరస్సు ఉంది. తీరంలోని 9 మండలాల్లో వందలాది గ్రామాలు ఉన్నాయి. జిల్లాకు వానలు కురిపించేదీ తుపానులే అయినా.. అక్టోబరు నుంచి డిసెంబరు దాకా ప్రజలు వణికిపోతారు. తీవ్రత ఏ స్థాయిలో ఉంటుందో చెప్పలేరు. తుపానులు విరుచుకుపడి అల్లకల్లోం సృష్టించిన చరిత్ర ఈ ప్రాంతాలకు ఉంది. తీరప్రాంత ప్రజలు తుపానుల్లో తలదాచుకోవడానికి, ప్రాణాలు కాపాడుకోవడానికి తుపాను షెల్టర్లను నిర్మించారు. అయితే వాటి అతీగతీ పట్టించుకోవడం లేదు. కూలిపోయి, కంపాచెట్లూ పెరిగిపోయి కనీస రక్షణ కల్పించలేని స్థితిలో ఇవి ఉన్నాయి. దీంతో చాలా చోట్ల అవసరకాలంలో ప్రభుత్వ బడులూ, కాలేజీలూ తుపాను షెల్టర్లుగా మారిపోతుంటాయి. ప్రజాప్రతినిధులు పట్టించుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి సురక్షిత కేంద్రాలుగా వీటిని నిర్మించాల్సివుంది.

- ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్

ఇవి కాపాడుతాయా?

దారుణ స్థితిలో జిల్లాలోని తుపాను షెల్టర్లు



గోవిందపల్లిపాళెంలో

వాకాడు: కాపాడలేని భవనాలు

వందకుపైగా ఉన్న గిరిజన కుటుంబాలు తుఫానుల సమయంలో తలదాచుకోవడానికి వాకాడు మండలం చీమలపాడులో తుఫాను షెల్టర్ నిర్మించారు. అయితే 15 ఏళ్ల కిందటే ఇది శిథిలావస్థకు చేరుకుంది. దీంతో సమీప గ్రామాలకు ప్రాణాలు అరచేతపట్టుకుని తరలిపోతుంటారు. కొత్త భవనం నిర్మించండి అంటూ కోరుతున్నా వీరి మొర ఆలకించే వారు లేరు. ఇదే మండలంలోని అందలమాల, వాలమేడు గ్రామాల్లో కూడా తుఫాను షెల్టర్లు కూలిపోయే స్థితిలో వున్నాయి. తూపిలిపాలెం మత్స్యకార గ్రామంలో అయితే తుపాను షెల్టరు పూర్తిగా శిథిలమై పోయింది. 250 కుటుంబాలు తుఫాను వచ్చినపుడల్లా అతలాకుతలం అవుతుంటారు. ఇక దుగరాజపట్నంలోని తుఫాను షెల్టర్‌ను పంచాయతీ కార్యాలయంగా మార్చేశారు. ఇది కూడా శిథిలావస్థలో వుంది. ఉరుస్తోంది. 2017లో కొండూరుపాలెం, మనపాలెం మత్స్యకార గ్రామాల్లో కట్టిన తుపాను షెల్టర్లు మాత్రం ప్రజలను ఎంతోకొంత ఆదుకుంటున్నాయి.



చీమలపాడులో



దుగరాజపట్నంలో

చిల్లకూరు: అరక్షిత కేంద్రాలు



అద్దేపల్లిలో

చిల్లకూరు మండలం వరగలి గ్రామంలో 35 ఏళ్ళ కిందట కట్టిన తుపాను షెల్టర్ శిథిలమైంది. దీంతో జడ్పీ హైస్కూలును తాత్కాలిక పునరావాస కేంద్రంగా వాడుతున్నారు. అద్దేపల్లిలో 30 ఏళ్ళ కిందట కట్టిన తుపాను షెల్టర్ సైతం దెబ్బతిని కూలిపోయే స్థితిలో వుంది. తుఫాన్ల సమయంలో గ్రామస్తులను సమీపంలోని తూర్పు కనుపూరు గ్రామానికి తరలిస్తున్నారు. మండలంలోని తూర్పు కనుపూరు, మోమిడి, కొమరవారిపాలెం, మన్నేగుంట, వేళ్ళపాలెం, బల్లవోలు గ్రామాల్లో కూడా షెల్టర్లు వున్నప్పటికీ అవి సైతం కూలిపోయేందుకు సిద్ధంగా వున్నాయి.

చిట్టమూరు: ఉపయోగపడితే కదా!

చిట్టమూరు మండలం బురదగాలి,పల్లంపర్తి,పిట్టి వానపల్లి గ్రామాల్లో తుపాను షెల్టర్లు వున్నాయి.వీటిలో బురదగాలి, పల్లంపర్తి భవనాలను వినియోగించే పరిస్థితి లేదు.కూలిపోయే స్థితిలో వున్నాయి. కేవలం పిట్టివానపల్లి గ్రామంలోని భవనం మాత్రం నూతనంగా నిర్మించింది.

తడ: భూతాల నిలయాలు

తడ మండలం కారిజాత, వాటంబేడు గ్రామాల్లో తుపాను షెల్టర్లు భూతాల నిలయాలను తలపిస్తున్నాయి. భవనాలు శిథిలమై లోపల అడుగుపెట్టే పరిస్థితి లేదు. ఈ రెండిటితో పాటు వేనాడు, ఇరకం, మాంబట్టులలో వున్న షెల్టర్లు కూడా పాతికముప్పై ఏళ్ళ కిందటివి. గత పదిహేనేళ్ళుగా మరమ్మతులకు నోచుకోలేదు. అన్నీ కూలిపోయేందుకు సిద్ధంగా వున్నాయి. వీటి స్థానంలో కొత్త భవనాలు నిర్మించడంతో పాటు తడ, కాదలూరుల్లో కూడా షెల్టర్లు అవసరం.



ఇరకంలో



కారిజాతలో

కోట: కూలిపోయేందుకు సిద్ధంగా

కోట మండలం దైవాల దిబ్బ గ్రామంలో తుఫాను షెల్టర్ ఏ క్షణంలోనైనా కూలిపోయే దుస్థితిలో వుంది. దీనితో పాటు గోవిందపల్లిపాలెం, శ్రీనివాససత్రం, సిద్ధవరం, కర్లపూడి, శ్యామసుందరపురం, కొత్తపట్నం గ్రామాల్లోని తుఫాను షెల్టర్లు కూడా కూలిపోయే స్థితిలో వున్నాయి. ఈ కట్టడాలను 1986లో నిర్మించారు. అప్పటి నుంచీ మరమ్మతులు కూడా చేపట్టలేదు. వీటి స్థానంలో కొత్త భవనాలను నిర్మించాల్సి ఉంది. అలాగే ఉత్తమ నెల్లూరు, వంజివాక, నెల్లూరు కొత్తపాలెం గ్రామాల్లో కూడా తుఫాను షెల్టర్లు అవసరం.

దొరవారిసత్రం: పాములకు ఆవాసం



కారికాడులో

దొరవారిసత్రం మండలం వేలికాడు, కారికాడు గ్రామాల్లో 30 ఏళ్ళ కిందట తుఫాను షెల్టర్లు కట్టారు. ఆ భవనాలు శిథిలావస్థకు చేరాయి. తలుపులు, కిటికీలు సైతం లేవు. చెట్లు పెరిగిపోయి పాములకు ఆవాసంగా మారాయి.

సూళ్ళూరుపేట: ఆరు షెల్టర్లదీ అదే దారి

కుదిరిలో



సూళ్ళూరుపేట మండలం కడపత్ర, కొరిడి, కుదిరి, కేసీఎన్ గుంట, దావది గుంట, గోపాల్‌రెడ్డిపాలెం గ్రామాల్లో షెల్టర్లు వున్నాయి. అయితే అన్నీ మూడు దశాబ్దాల కిందట నిర్మించినవి. శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎలాంటి వసతులూ లేవు. వీటి స్థానంలో కొత్త భవనాలు కట్టడంతో పాటు అదనంగా అటకానితిప్ప, సూళ్ళూరుపేటల్లో తుఫాను షెల్టర్లు కట్టాల్సిన అవసరముంది.

నాయుడుపేట: ఇక్కడొకటి కట్టండయ్యా

నాయుడుపేట మండలంలో తుఫాను షెల్టర్లు లేవు. తుఫాన్లు సంభవించినపుడు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, టంగుటూరు ప్రకాశం పంతులు పాఠశాలలను తాత్కాలిక పునరావస కేంద్రాలుగా వాడుతున్నారు. కనీసం మండల కేంద్రంలోనైనా తుఫాను షెల్టర్లు నిర్మించాల్సిన అవసరముంది.

రోడ్డు రోలర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● రామానుజపల్లె వద్ద ఘటన ● బస్సులోని 39 మందికి, రోడ్డు రోలరులో ఒకరికి గాయాలు



రుయాలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం రామానుజపల్లె వద్ద మంగళవారం ఉదయం వేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రోడ్డు రోలరును ఢీకొంది. బస్సులో 50 మంది ఉండగా 39 మంది.. రోడ్డు రోలరులో ఒకరికి.. మొత్తం 40 మంది గాయపడ్డారు. వీరిలో ఐదుగురి పరిస్థితి కొంత ఇబ్బందికరంగా ఉంది. వివరాలిలా ఉన్నాయి. చిత్తూరు-2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మంగళవారం తెల్లవారుజామున బెంగళూరు నుంచి బయలుదేరింది. ఉదయం 8.35 గంటల ప్రాంతంలో తిరుపతి రూరల్ మండలం రామానుజపల్లె సర్కిల్ వద్దకు వచ్చింది. అదే సమయంలో చంద్రగిరి నుంచి తిరుపతి వైపు రోడ్డు రోలరు వెళుతోంది. అతి వేగంగా వచ్చిన బస్సు.. అదుపు తప్పి రోడ్డు రోలర్‌ను ఢీకొంది. దీంతో రోడ్డు రోలరు డివైడర్ పైకి వెళ్లి ఆగింది. ఈ ప్రమాదంలో చంద్రగిరి మండలం పిచ్చినాయుడుపల్లికి చెందిన జి.కుమార్‌కు తీవ్ర గాయాలవడంతో తిరుపతిలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఇక, బస్సు డ్రైవరు రవి, కండక్టరు ఈపీ రెడ్డి సహా 39 మందికి గాయాలయ్యాయి. తిరుపతి రూరల్ ఎస్ఐ రామకృష్ణ, షేక్ షావలి, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని అంబులెన్సులు, బస్సు ద్వారా ద్వారా బాధితులను తిరుపతి రుయాకు తరలించారు. ఆర్టీసీ అధికారులు కూడా ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించేందుకు సహాయ సహకారాలు అందించారు. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ముందు దెబ్బతినగా.. రోడ్డు రోలర్ జంక్షన్ పాయింట్ కట్ అయింది. దీంతో ఇంజన్ నుంచి వెనుక భాగం వేరై డివైడర్ పైకి ఎక్కింది. బస్సు ఇంజన్ బాగా దెబ్బతింది. ఈ ఘటనలో బస్సు డ్రైవర్ తప్పిదమే ప్రధాన కారణంగా పోలీసులు భావించి కేసు నమోదు చేశారు. ఆర్టీసీ బస్సును సీజ్ చేశామని ఎస్ఐ రామకృష్ణ చెప్పారు. క్షతగాత్రులు రుయాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కుమార్‌తో పాటు రమేష్, శరవణ, ధర్మ, హనుమంతప్ప పరిస్థితి కొంత ఇబ్బందికరంగా ఉన్నట్లు తెలిసింది. ఈ ప్రమాదంపై రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ ఆరా తీశారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఆదేశించారు.





దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు ముందుభాగం - డివైడర్‌పైకి ఎక్కిన రోడ్డురోలరు

రూ.3.5 కోట్ల ఎర్రచందనం స్వాధీనం

● గుజరాత్‌లో గోడౌన్లపై దాడి చేసి పట్టుకున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు ● ముగ్గురు అంతర్రాష్ట్ర స్మగ్లర్ల అరెస్ట్



పట్టుబడ్డ ఎర్రచందనాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ, టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి

మంగళం, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాష్ట్రం పటాన్‌లోని గోడౌన్లపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి రూ.3.5 కోట్ల విలువైన 155 ఎర్రచందనం దుంగలను పట్టుకున్నారు. ముగ్గురు ప్రధాన స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. ఈ దుంగలను తిరుపతికి తీసుకొచ్చారు. కపిలతీర్థం వద్ద గల టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్‌తో కలిసి జిల్లా ఎస్పీ, టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి ఎల్.సుబ్బరాయుడు మంగళవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. 'కొద్ది రోజుల కిందట అన్నమయ్య జిల్లా సానిపాయ వద్ద రాంప్రసాద్, రవిశంకర్ అనే స్మగ్లర్లను అరెస్ట్ చేశాం. వీరిని విచారించగా గుజరాత్‌కు చెందిన స్మగ్లర్లతో సంబంధాలు ఉన్నట్లు తేలింది. దీంతో టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ ఎండీ షరీఫ్ బృందం, గుజరాత్ పోలీసుల సహకారంతో పటాన్‌లోని గోడౌన్లపై దాడిచేశారు. గుజరాత్‌లోని దీసా పట్టణానికి చెందిన ఉత్తమ్‌కుమార్ నందకిషోర్‌సోనీ, జోషి హన్స్‌రాజ్, పఠాన్ పట్టణానికి చెందిన పరేష్ జి కాంతిఠాకూర్‌ను అరెస్ట్ చేశాం. ఐదు టన్నుల దుంగలను, ఒక కారుని సీజ్ చేశాం' అని టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జి సుబ్బరాయుడు తెలిపారు. ప్రధాన స్మగ్లర్లను అరెస్ట్ చేసేందుకు దర్యాప్తు కొనసాగుతుందన్నారు. ఈ ఆపరేషన్‌లో ప్రతిభ కనబరచిన టాస్క్‌ఫోర్స్ అధికారులను, సిబ్బందికి నగదు బహుమతి అందించారు. టాస్క్‌ఫోర్స్ డీఎస్పీలు జి.బాలిరెడ్డి, వి.శ్రీనివాసరెడ్డి, ఎండీ షరీఫ్, ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఎం.సురేష్‌కుమార్, ఎస్ఐ రఫీ తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి

రోడ్డు విస్తరణతో చంద్రగిరి అభివృద్ధి

బాధితుల అభిప్రాయాలు సేకరించిన కమిటీ



సమావేశంలో మాట్లాడుతున్న గ్రామస్తులు

చంద్రగిరి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి జాతీయ రహదారి నుంచి తొండవాడ వరకు ఉన్న రహదారి విస్తరణ చేపడితేనే పట్టణం అభివృద్ధి చెందుతుందని చంద్రగిరి గ్రామస్తులు, వర్తక, వ్యాపారస్తులు, అన్నిరాజకీయ పార్టీల నాయకులు అభిప్రాయపడ్డారు. మంగళవారం చంద్రగిరి డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రైవేటు కళ్యాణ మండపంలో రహదారి ఇరువైపులా ఉన్న వర్తక, వ్యాపారస్తులు, గ్రామస్తులు, అన్ని రాజ కీయ పార్టీల నాయకులతో రోడ్డు విస్తరణపై సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అందురూ రోడ్డు విస్తరణ చేపట్టాలని, అప్పుడే చంద్రగిరి మరింత అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. స్థల సేకరణ, దుకాణాలు కోల్పోతున్నవారికి ఇచ్చే నష్టపరిహారం వివరాలు ముందుగా తెలియజేయాలని కమిటీని వ్యాపారులు కోరారు. అనంతరం టీడీపీ సీనియర్ నాయకులు కుమారరాజారెడ్డి మాట్లాడుతూ గ్రామస్తులు, అన్నిరాజకీయ పార్టీల నాయకులు పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్డు విస్తరణ బాధితుల అభిప్రాయాలను ఎమ్మెల్యే నాని దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారంతో సంపూర్ణ న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ వాసు, సభ్యులు గౌస్‌బాషా, నాగరాజనాయుడు, జనార్ధన్‌రెడ్డి, ఓంకార్, దుబాసి రామ్మూర్తి పాల్గొన్నారు.

చంద్రగిరిలో పెన్షనర్లకు సన్మానం



సీనియర్ పెన్షన్‌దారులను సన్మానిస్తున్న దృశం

చంద్రగిరి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలో ప్రభుత్వ పెన్షనర్ల దినోత్సవాన్ని ఆ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఉప ఖజానాధికారి యోగానంద రెడ్డి, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త త్యాగ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ కోసం పోరాడిన డీఎస్ నకారా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీనియర్ పెన్షన్ దారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, మూలస్థాన ఎల్లమ్మ ఆలయ మాజీ చైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి పట్టాభి, కోశాధికారి చిరంజీవులునాయుడు, పార్లపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, సీతారామిరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించాలి

సర్పంచ్‌లు, కార్యదర్శులకు రెండురోజుల శిక్షణ ప్రారంభం

తిరుపతిరూరల్, డిసెంబరు 17(ఆంధ్ర జ్యోతి): గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించి అభివృద్ధిపథంలో ముందుకు నడిపించాలని విస్తరణ శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ నాగపద్మజ తెలిపారు. తిరుపతి రూరల్ మండలంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో స్థానికీకరణ-సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన రెండురోజుల శిక్షణ మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా తొలిరోజు పలువురు రిసోర్స్‌పర్సన్లు మాట్లాడుతూ గ్రామాల్లో పేదరికంలేని మెరుగైన జీవనోపాధి, ఆరోగ్యం, చైల్డ్ ఫ్రెండ్లీ విలేజ్, తగినంతనీరు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. వివిధ థీమ్స్‌కి సంబంధించి రిసోర్స్‌పర్సన్లుగా ఎంపీడీవో రామచంద్ర, ఏపీఎం పత్తిపాటి నాగేశ్వరరావు, ఎంపీహెచ్‌వో దేవయాని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తులసమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హిమంత్‌కుమార్, పెరుమాళ్లపల్లె పంచాయతీ కార్యదర్శి ఎ.మధుసూదన్ వ్యవహరించారు. డీఎల్‌డీవో నారాయణరెడ్డి, డీఎల్‌పీవో బి.సురేష్‌నాయుడు, ఎంపీడీవో రామచంద్ర, గ్రామసచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

చెరువు కాలువ ఆక్రమణలపై ఫిర్యాదు



పాకాల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామలచెరువులో మంగళ వారం తహసీల్దార్ నిత్యానందబాబు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహిం చారు. ప్రజలు వివిధ సమస్యలపై 25 వినతులు అందజేశారు. కుక్కలపల్లె దళితవాడకు చెందిన పి.మోహన్, లింగన్న చెరువు అక్ర మణలపై వినతి పత్రం అందజేశారు. కొండేపల్లె నుంచి లింగన్నచెరువుకు వర్షపునీరు ప్రవహించే కాలువను పలువురు ఆక్రమించి నిర్మాణాలు చేశారని, చెరువు స్థలం సైతం ఆక్రమిస్తున్నారని తెలియజేశారు. అక్రమ కట్టడాలను తొలగించి కాలువల్లో పూడిక తీయించి చెరువు స్థలం సర్వే చేసి సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌డీటీ కళ్యాణ్, వీఆర్వో సుబ్రమణ్యం రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సంఘాల చైర్మన్, వైస్‌చైర్మన్‌కు సన్మానం



రామచంద్రాపురం, డిసెం బరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బలిజ పల్లి వద్ద ఉన్న గుండాల వంక చెరువు సాగునీటి సంఘాల చైర్మన్ బాదూరు నరసింహారెడ్డి, వైస్ చైర్మన్ సుంకరకృష్ణయ్యను ఎమ్మెల్యే పులివర్తి నాని ఘనంగా సన్మానించారు. మంగళవారం ఎమ్మెల్యే నానిని రఘునాథ రిసార్ట్‌లో వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుండాల వంక చెరువు అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఆయకట్టు రైతులకు సకాలంలో సాగునీరు అందేలా చూస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరుమలరెడ్డి, జనార్ధన్‌చౌదరి, రాజేష్‌రెడ్డి, త్యాగరాజులు, ఈశ్వరరాయల్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ

రామచంద్రాపురం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిరెడ్డిపల్లి రైతు సేవా కేంద్రంలో మంగళవారం పండ్లతోటల సాగులో మెరుగైన యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భం వ్యవసాయ శాఖ జిల్లా ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ భాస్కరయ్య మాట్లాడుతూ తేలికగా దున్నడం, తోటలను శుభ్రం గా ఉంచడం, పూత బాగా రావడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పూత తొలి దశలో చీడల నివారణ తదితర అంశాలపై తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. పిందె ఏర్పడే దశలో పోషణలపై రైతులకు అవగాహన కల్పించారు. ఉద్యాన వన శాఖ అధికారి సునీల్ ఉద్యానవన పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి స్రవంతి, రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతుల్లో వరి సాగు చేయండి

భాకరాపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సమగ్ర యాజమాన్య పద్ధతులలో వరి సాగు చేయాలని జిల్లా వనరుల కేంద్రం ఏవోలు శ్రీనివాసరావు, వేణుగోపాల రావు అన్నారు. చిన్నగొట్టిగల్లు మండ లం భాకరాపేట, దీన్‌దార్లపల్లెలో మంగళ వారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. వరిలో నూతన వంగ డాల గురించి వివరించారు. వేరుశనగలో కలుపు తీసేవారు ఎకరానికి 200 కిలోల జిప్సం వేసుకోవాలన్నారు. భూసార ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలన్నారు. అనంతరం మిరప పంటను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఉద్యానశాఖ అధికారి శివకుమారి, ఏవో ధనలక్ష్మి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

రామచంద్రాపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరుగు తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వి నియోగం చేసుకోవా లని తిరుపతి రెవెన్యూ డివిజన్ రెవెన్యూ సదస్సుల ప్రత్యేకాధికారి కేఎం రోజ్మండ్ కోరారు. మండలం లోని నెన్నూరులో మంగళ వారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ మొత్తం 82 వినతులు అందాయన్నారు. నిర్ణీత సమయంలో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తహసీల్దారు వెంకటరమణ, డీటీ అన్వర్‌బాషా, టీడీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, మురళీనాయుడు, నీలకంఠ చౌదరి, బాబు నాయుడు, రీసర్వే డిప్యూటీ తహసీల్దారు అమృత, సర్వేయర్ రమేష్‌బాబు, ఆర్‌ఐ లక్ష్మీనారాయణ, వీఆర్వోలు శ్రీనివాసులు, నరసింహులు, కార్యదర్శి అల్లెబ్బ పాల్గొన్నారు.

స్విమ్స్‌లో తాగునీటి కొళాయిల ముందు పారిశుధ్య చర్యలు





తిరుపతి(వైద్యం), డిసెంబరు 17(ఆంధ్ర జ్యోతి): స్విమ్స్‌లో తాగునీటి కొళాయిల ముందు పాచిపట్టి అధ్వానంగా ఉన్న పరిసరాలపై స్విమ్స్ అధికారులు దృష్టిసారించి శుభ్రం చేయించారు. ఓపీడీ భవనం వెనుక, పెథాలజీ విభాగం సమీపంలోని ఉన్న తాగు నీటి కొళాయిల వద్ద అధ్వానంగా ఉన్న పారిశుధ్యంపై 'స్విమ్స్‌లో అధ్వానంగా తాగునీటి కొళా యిలు' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో మంగళవారం కథనం ప్రచురితమైంది. స్పందించిన మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ వెంటనే కొళా యిల పరిసరాల్లో పారిశుధ్య చర్యలు చేయించారు. బ్లీచింగ్ చల్లించారు.

విద్యుత్ ఉద్యోగులకు ప్రమాద బీమాపై అవగాహన

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 17(ఆంధ్ర జ్యోతి): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యో గులు ప్రమాద బీమా చేసుకోవడంవల్ల మంచి ఫలితాలు ఉంటాయని చీఫ్ జనరల్ మేనేజరు హెచ్‌ఆర్‌డీ రమణాదేవి పేర్కొన్నారు. తిరుపతి సదరన్ డిస్కం కార్యాలయంలో మంగళవారం సంస్థలో ని ఉద్యోగ సంఘాల నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఉద్యోగులు ప్రమాద బీమా ఏడాదికి రూ.2600లు చెల్లిస్తే రూ.20 లక్షలు నష్ట పరిహారం లభిస్తుందని తెలిపారు. ప్రభుత్వ ప్రైవేటు కంపెనీలు అమలు చేస్తున్న పాలసీల వివరాలను ఆమె వివరించారు. వచ్చే ఏడాది నుంచి అమలు జరిగేవిధంగా చర్యలు తీసుకుం టామని చెప్పారు. జనరల్ మేనేజరు వెంకట రాజు, ఉద్యోగ సంఘాల నాయకులు బి.బాలాజీ, ఎల్.చలపతి, కిషోర్, వెలగటూరు గోపి, మురళీ ధర్, బషీర్, ప్రసాద్, జనార్దన్, అభినయ్, నాగ రాజు, రవికుమార్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతుల తనిఖీ



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో కేవీఎన్ కుమార్

రామచంద్రాపురం, డిసెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని సీ.రామాపురం వెరిటాస్ సైనిక్ స్కూల్లో తిరుపతి, నెల్లూరు, అన్నమయ్య జిల్లాల ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణా తరగతులను మంగళవారం డీఈవో కేవీఎన్ కుమార్ తనిఖీ చేశారు.భోజన నాణ్యత, వసతి కల్పనపై ఆరా తీశారు. ఏఎంవో శివశంకరయ్య, ఎంఈవో భాస్కర్, ఏఎస్‌వో సారథి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్విజ్‌కు సిరి



సిరిని అభినందిస్తున్న హెచ్‌ఎం సుజనీకుమారి

రామచంద్రాపురం, డిసెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని కుప్పం బాదూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న అత్తూరు సిరి రాష్ట్ర స్థాయి కౌశల్ క్విజ్ పోటీలకు ఎంపికైంది. మంగళ వారం ఆ విద్యార్థిని హెచ్‌ఎం సుజ నీకుమారి, ఉపాధ్యాయులు అభినందించా రు. ఈ నెల 30న విజయవాడలో జరగ నున్న రాష్ట్రస్థాయి కౌశల్ పోటీల్లో సిరి పాల్గొం టుందని తెలిపారు. కో-ఆర్డినేటర్ శైలేందర్‌కుమార్, వాసు, రవికుమార్, సునీత, రజని పాల్గొన్నారు.

ఘనంగా షర్మిల పుట్టినరోజు



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

చంద్రగిరి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద పీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. చంద్రగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఐరాల లోకేష్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. నాయ కులకు, కార్యకర్తలకు పంచి పెట్టారు. అనంత రం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి కాంగ్రెస్ పార్టీ నాయకులు కలేందర్, నాయకులు శివబాలాజీ, ఉషా, అక్బర్ పాల్గొన్నారు.

భవిత పాఠశాల తనిఖీ



చంద్రగిరి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలోని భవిత పాఠశాలను జిల్లా అధికారులు తనిఖీ చేశారు. మంగళవారం సహిత విద్య సమన్వయకర్త చంద్రశేఖర్‌రెడ్డి, ప్లానింగ్ కో-ఆర్డినేటర్ రామచంద్రారెడ్డి తనిఖీ చేశారు. అక్కడి పిల్లలు అకడమిక్ స్కిల్స్‌పై శిక్షణ పొందుతున్నారు. ఈ క్రమంలో జిల్లా అధికారులు ఆ శిక్షణను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో భాస్కర్‌బాబు, బాలి కల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకట రమణారెడ్డి, భవిత పాఠశాల ఉపాధ్యాయులు రాజేశ్వరి, శ్యామలాదేవి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



మాట్లాడుతున్న తహసీల్దారు జనార్దన్ రాజు

భాకరాపేట, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు జనార్దన్ రాజు తెలిపారు. చిన్నగొట్టిగల్లు మండలం నెల్లుట్లవారిపల్లె, కోటబైలు గ్రామాలలో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులో మ్యుటేషన్, భూసర్వే, దారి సమస్యలు, ఇళ్ల స్థలాల కోసం 41 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో డీటీ వాసుదేవ కుమార్, ఆర్‌ఐ జానకీరామ్, సర్వేయర్లు గణేశ్, కేశవులు, మనోహర, వీఆర్వో పాల్గొన్నారు.

తిరుచానూరులో కియోస్క్ ప్రారంభం



స్కాన్‌చేస్తున్న జేఈవో వీరబ్రహ్మం

తిరుచానూరు, డిసెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): తిరుచానూరు అన్నదానం కాంప్లెక్సులో మంగళవారం టీటీడీ జేఈవో వీరబ్రహ్మం సెల్ఫ్ సర్వీస్ కియోస్క్‌ను ప్రారంభించారు. ఈ యంత్రం భక్తుల నుంచి రూ.లక్ష వరకు విరాళం స్వీకరిస్తుంది. దీనిని కెనరా బ్యాంకు విరాళంగా అంద జేసింది. డిప్యూటీ జీఎం (ఐటీ) వెంకటేశ్వర్లునాయుడు, అన్న ప్రసాదం సూపరింటెండెంట్ ఉష పాల్గొన్నారు.

శ్మశాన వాటికలకు స్థలాలు కేటాయించండి

ఎర్రావారిపాళెం, డిసెంబరు 17(ఆంధ్ర జ్యోతి): మండలంలోని దళిత, బలహీన వర్గాలున్న పల్లెలకు శ్మశాన వాటిక స్థలాలు కేటాయించాలని డప్పు కళాకారుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెళ్ల శ్రీనివాసులు కోరారు. బోడేవాండ్లపల్లెలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ పరమేశ్వరస్వామికి వినతి పత్రం అందజేశారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

ఘనంగా రైల్వే పెన్షనర్స్ దినోత్సవం

పాకాల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే కల్యాణ మండపం లో మంగళవారం రైల్వే పెన్షనర్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ చైర్మన్ ఆల్బర్ట్ అధ్యక్షతన నిర్వహించిన సభలో పెన్షనర్ల సమస్యలపై చర్చించారు. నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, కమ్యూటేషన్ 10 సంవత్సరాల 8 నెలలకు ఆపుచేసి ఎక్కువగా వసూలు చేసిన మొత్తాన్ని తిరిగి చెల్లించాలని కోరారు. రివైజ్డ్ పే ఆర్డర్లు ఇప్పించాలని, ఉద్యోగులతో సమానంగా హెచ్‌ఆర్‌ఏ ఇవ్వాలని కోరారు. అనంతరం 75 సంవత్సరాలు పూర్తయిన పెన్షనర్లను సన్మానిం చారు. తిరుపతి అగర్వాల్ కంటివైద్య శాల డాక్టర్లచే కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు డివిజన్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జయంత్‌కుమార్, అసోసియేషన్ చీఫ్ అడ్వయిజర్ సి.గురవయ్యానాయుడు, ట్రెజరర్ రాము, ఆరోగ్యనాథన్, కస్తూర్ బాషా, విశ్వనాథరెడ్డి, మణి, రంగయ్య, పట్టాభి, ప్రభాకర్, శ్రీనివాసులునాయుడు, రామస్వామిపిళ్లై, ఖాదర్ బాషా పాల్గొన్నారు.

మా భూములకు హద్దులు చూపండి

సి.గొల్లపల్లె రెవెన్యూ సదస్సులో 12 ఫిర్యాదులు

తిరుపతిరూరల్, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): మాభూములకు హద్దులు చూపించాలని సి.గొల్లపల్లెకి చెందిన పలువురు రైతులు రెవెన్యూ అధి కారులకు విన్నవించారు. తిరుపతి రూరల్ మండలం గొల్లపల్లె పంచా యతీలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు రైతులు తహసీల్దార్ రామాంజులు నాయ క్‌కు అర్జీలు అందించారు. భూములకు హద్దులు చూపించాలని నలుగురు రైతులు, హక్కులు కల్పించాలని (రికార్డ్స్ ఆఫ్ రైట్స్)కోరుతూ 8మంది రైతులు చొప్పున మొత్తం 12 మంది అర్జీలను అందజేశారు. పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలు, ఉపసర్పంచ్ సి.చెంగారెడ్డి, టీడీపీనేతలు చొక్కారెడ్డిగారి మనోహర్‌రెడ్డి, పి.మురళిరెడ్డి, నవీన్‌రెడ్డి, కె.ప్రభాకర్‌రెడ్డి, జి.భాను, సి.వెంకటరెడ్డి, ఎ.చెంగారెడ్డి, టి.రాంబాబు, రవికుమార్, రవిఆచారి, ఈశ్వరాచారి, కె.వెంకటరమణారెడ్డి, కె.గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ను ఆహ్వానించలేదని సోషల్ మీడియాలో వైసీపీ పోస్టు

ఇదిలాఉండగా రెవెన్యూసదస్సుకు గ్రామ సర్పంచ్‌ని ఆహ్వానించలేదని, దీనిపై మండల సర్పంచ్‌ల సంఘ ఆధ్వర్యంలో నిరసన చేపడుతామని చంద్రగిరి సోషల్ మీడియా గ్రూపులో వైసీపీనేత పెట్టిన పోస్టుపై గ్రామానికి చెందిన టీడీపీ నేతలు మనోహర్‌రెడ్డి, చెంగారెడ్డిలు స్పందించారు. రామానుజపల్లె, గొల్లపల్లె గ్రామంలో జరిగే రెవెన్యూ సదస్సుకి సంబంధించిన దండోరా సర్టిఫికెట్‌లో ఈ నెల16న సోమవారం సర్పంచ్ రవితోపాటు పలువురు గ్రామస్తులు కూడా సంతకాలు చేశారని పేర్కొన్నారు. సర్పంచ్‌తోపాటు గ్రామానికి చెందిన వైస్‌ఎంపీపీ కూడా సంతకం చేశారని తెలియజేశారు.

రుయాలో ఆక్రందనలు



క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్న వైద్యులు





బస్సులో నుంచి క్షత గాత్రులను కిందకు దించుకుంటున్న సెక్యూరిటీ సిబ్బంది

తిరుపతి(వైద్యం), డిసెంబరు 17(ఆంధ్ర జ్యోతి): తిరుపతి రుయాస్పత్రిలో మంగళ వారం క్షతగాత్రుల ఆక్రందనలు మిన్నంటాయి. తిరుపతి రూరల్ రామానుజపల్లె వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడ్డ 36 మందిని రుయా స్పత్రికి తీసుకువచ్చారు. వీరిలో తీవ్రంగా గాయపడిన 20 మందిని 108 వాహనంలో, మిగిలిన 16 మందిని ఆర్టీసీ బస్సులో తీసుకు వచ్చారు. ప్రమాదంపై అప్రమత్తమైన రుయా అధికారులు ముందుగానే అత్యవసర విభాగం, ట్రయేజ్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వైద్యులు, పీజీ వైద్య విద్యార్థులు హుటాహుటిన వైద్యం అందించారు. అత్యవసర విభాగం పూర్తిగా క్షత గాత్రులతో నిండిపోయింది. సీఎస్‌ఆర్‌ఎంవో శ్రీనివాస్, ఏఆర్‌ఎంవో హరికృష్ణలను క్షతగాత్రు లను పరిశీలించి వారికి మెరుగైన వైద్యం అందించాలని సూపరింటెండెంట్ రవిప్రభు ఆదేశించారు.

తెలిసినవారి పనేనా..?

● వృద్ధురాలి హత్యకేసులో పోలీసుల ముమ్మర దర్యాప్తు

తిరుచానూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పాడిపేటలో జీవరత్నమ్మ అనే వృద్ధురాలి హత్య తెలిసిన వారి పనే అయి ఉండవచ్చని పోలీసుల అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జీవరత్నమ్మ సోమ వారం హత్యకు గురైన విషయం తెలి సిందే. మృతురాలి కుమార్తె లలిత ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం తిరుచానూరు సీఐ సునీల్ కుమార్, క్రైమ్ పోలీసులు సంఘటనా స్థలం లో స్థానికులను విచారించారు. దుండగులు మృతురాలి శరీరంపై ఉన్న నగలనుమాత్రమే తీసుకెళ్లారు. బీరావాలో ఉన్న లక్షలాది రూపాయల నగలు అలాగే ఉన్నాయి. దోపిడీ దొంగలు అయితే వృద్ధురాలి జీవరత్నమ్మ శరీరంపై నగలతో పాటు ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలను కూడా దోచుకెళ్లేవారు అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. మృతురాలి బంధువులు, ఆ ఇంట్లో అద్దెకు ఉన్న వ్యక్తులపై దృష్టిసారించారు. మరో వైపు గంజాయి బ్యాచ్‌పై నిఘా ఉంచారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

ఎర్రావారిపాళెం, డిసెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య చేసుకొంది. పోలీసులు కథనం మేరకు.. ఎర్రావారిపాళెం గ్రామం ఇర్లపాళా నికి చెందిన క్రిష్ణవేణి (22) కుటుంబ కుటుంబ కలహాలతో మంగళవారం విషపు గుళికలు తిని ఆత్మహత్య చేసుకొన్నది. ఆమె భర్త ఇటీవలే బతుకుదెరువు కోసం గల్ఫ్ వెళ్లాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

బాలాజీనగర్‌లో ఇళ్లు కేటాయించండి



తిరుమల, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): తమకు బాలాజీనగర్‌లో ఇళ్లు కేటాయించాలని తిరుమలలోని ఆర్బీ సెంటర్ వాసులు టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డికి వినతిపత్రాన్ని అంద జేశారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌కు సమీపం లో ఉన్న ఆర్బీ సెంటర్‌ను భానుప్రకాష్‌రెడ్డి మంగళ వారం సందర్శించారు. ఈ సంద ర్భంగా అక్కడి స్థానికులు తాము ఎదుర్కొం టున్న సమస్యలను ఆయనకు వివరించారు. 50 ఏళ్ల క్రితం నిర్మించిన ఇళ్లు కూలిపోయే స్థితిలో ఉన్నాయని, ఈ ఇళ్లను తొలగించి తమకు బాలాజీనగర్‌లో ఇళ్లను కేటాయిం చాలని కోరారు. సమస్యను బోర్డు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

విద్యుత్‌ను పొదుపు చేయండి

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 17(ఆంధ్ర జ్యోతి): విద్యుత్ పొదుపు చేసి భావితరాలకు బాసటగా నిలవడానికి ప్రయత్నిస్తామని, ఇందులో ప్రతి వినియోగదారుడు భాగస్వామి కావాలని తిరుపతి టౌన్ డివిజన్ ఈఈ వి.చంద్రశేఖర్‌రావు పిలుపునిచ్చారు. మంగళ వారం టౌన్ డివిజన్ పరిధిలోని మంగళం రూరల్స్ సెక్షన్ కార్యాలయంలో ఇంధనం పొదుపు వారోత్సవాలు నిర్వహించారు. అదేవిధంగా రేణిగుంటలోని గురవరాజుపల్లి సబ్‌స్టేషన్ వద్ద కూడా అవగాహన సదస్సు నిర్వహించారు. ఏడీఈలు మునిప్రసాద్, రమేష్, మహబుబ్‌బాష, ఏఈలు టి.మోహన్, పుణ్యకోటి, హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ నిధులు రికవరీ చేయండి

పాకాల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీలో అక్రమాలకు సంబంధించి రూ.89,060 నగదు రికవరీ చేయాలని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ ఆదేశించారు. మంగళ వారం ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ బహిరంగ సభ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. గత ఏడాది ఏప్రిల్ నుంచ ఈ ఏడాది మార్చి వరకు జరిగిన 1262 పనులకు రూ. రూ.6,88,29,426లు వ్యయం చేశారు. ఈ పనులపై తనిఖీలు నిర్వహించారు. మద్దినాయనిపల్లె, గానుగపెంట, ఆదెనపల్లె పంచాయతీల పరిధిలో జరిగిన పనుల్లో అవకతవతలను గుర్తించారు. రూ.89,060లు రికవరీ చేయాలని అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లోకనాథం, జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, ఎంపీడీలో అరుణ, డీవీవో శివయ్య, ఏపీడీ రెడ్డెప్ప, ఏపీవో కళ్యాణి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్స్ దినోత్సవం



మాట్లాడుతున్న మనోహరం

తిరుపతి(ఆటోనగర్), డిసెంబ రు 17(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విర మణ అనంతరం ప్రశాంత జీవనం గడపడానికి పెన్షన్ దోహదపడు తోందని విశ్రాంత ఆర్‌పీఎఫ్ ఉద్యో గుల సంఘం తిరుపతి శాఖ కార్య దర్శి మనోహరం అన్నారు. మంగళ వారం ఎస్వీ యూనివర్సిటీ ఎదుట వున్న ఆర్‌పీఎఫ్ బ్యారెక్స్‌లో జాతీయ పెన్షనర్స్ దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. నారక చిత్రపటం పెట్టి పుష్పాం జలి ఘటించారు. శ్రీధర్‌రెడ్డి, శ్రీ హరి, గోవర్ధన్, చంద్రయ్య, ఎన్‌పి. కన్నన్‌లు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులను కాపాడండి



మాట్లాడుతున్న కందారపు మురళి

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 17 (ఆంధ్ర జ్యోతి): కొన్ని రోజులుగా బంగ్లాదేశ్‌లో మైనారిటీ లుగా వున్న హిందువులు, బౌద్ధులు, క్రైస్తవులపై జరుగుతున్న దాడులను నివారించి, రక్షణ కల్పిం చాలని పలు రాజకీయపార్టీల నాయకులు కందారపు మురళి(సీపీఎం), పి.అంజయ్య(ఆ ర్‌పీఐ), మాంగాటి గోపాల్‌రెడ్డి(కాంగ్రెస్), విశ్రాంత న్యాయమూర్తి గుర్రప్ప, ప్రజాసంఘాల నాయ కులు రాధాకృష్ణ, బాల సుబ్రమణ్యం, సీనియర్ జర్నలిస్ట్ రాఘవశర్మ డిమాండ్ చేశారు. స్థానిక యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రపంచ మైనారిటీ హక్కుల దినోత్సవ సదస్సు జరిగింది. వారు మాట్లాడుతూ తిరుపతిలో మతోన్మాదులు ఘర్షణలు సృష్టించడమే పనిగా పెట్టుకున్నారని, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్వీయూలో ప్రొఫెసర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు.

మహాకుంభమేళాలో పటిష్ఠ ఏర్పాట్లు చేయండి



మాట్లాడుతున్న జేఈవో గౌతమి

తిరుమల, డిసెంబరు17 (ఆంధ్ర జ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్ (అలహాబాద్)లో జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26వ తేదీ వరకు జరగనున్న మహా కుంభమేళలో శ్రీవారి నమూనా ఆలయం ద్వారా ఉత్తరాది భక్తులు స్వామివారి వైభవాన్ని సంతృప్తిగా తిలకించేలా పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని టీటీడీ జేఈవో గౌతమి అధికారులను ఆదేశిం చారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో మంగళవారం ఆమె అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 45 రోజుల పాటు జరిగే కుంభమేళాలో దాదాపు 2.50 ఎకరాల విస్తీర్ణంలో టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేస్తోందన్నారు. తిరుమల తరహాలో శ్రీవారి నమూనా ఆలయానికి కావాల్సిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. విద్యుత్, పుష్పాలం కర ణలు ఆకట్టుకునేలా ఉండాల న్నారు. హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు, కళాబృందాలు ఏర్పాటు చేసుకో వాలన్నారు. యూపీ పోలీసులతో టీటీడీ విజిలెన్స్ అధికారులు సమన్వయం చేసుకుని పటిష్ఠమైన భద్రతను కల్పించాలని సూచిం చారు. మెడికల్ సిబ్బంది మందులు సమ కూర్చుకోవాలన్నారు. ప్రత్యేక రోజుల్లో ఎస్వీబీసీ నుంచి ప్రత్యక్ష ప్రసారాలు ఉండాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, డీపీపీ సెక్రటరీ రఘునాథ్, ప్రోగ్రాం ఆఫీసర్ రాజగోపాల్, ఎలక్ట్రికల్ ఎస్ఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంస్థల్లో వివిధ శాఖల్లో పదవీ విరమణ పొందిన పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక నరసింహతీర్థంరోడ్డులోని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో ఆ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. 35 మంది విశాంత ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పసుపులేటి హరిప్రసాద్, ఆర్కాట్ క్రిష్ణప్రసాద్, జిల్లా ట్రెజరీ అధికారి ఎం.లక్ష్మీకరరెడ్డి, సంఘం నాయకులు కేఆర్ శంకర్, నాగరాజు, లక్ష్మీనారాయణ, జయరామనాయుడు, సిద్ధయ్య, ఎస్.మెహరున్‌బీ, కృపావర్మ, జి.గోపాల్, సి.వెంకటేశం శెట్టిలతో పాటు తిరుపతి శాఖ నాయకులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

పెన్షనర్లకు అండగా ఉంటాం

మేయర్ శిరీష, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం


పెన్షనర్లకు సన్మానం చేస్తున్న మేయర్ శిరీష, ఎమ్మెల్సీ సిపాయి

తిరుపతి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లకు అండగా ఉంటామని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నగర మేయర్ డాక్టర్ శిరీష, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో అఖిలభారత పెన్షనర్ల దినోత్సవాన్ని మంగళవారం తిరుపతి ఆఫీసర్స్ క్లబ్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న మేయర్, ఎమ్మెల్సీలు విశ్రాంత ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, పెన్షనర్ల సంఘ నాయకులు మార్కొండ రెడ్డి, లక్ష్మీరెడ్డి, సుబ్రమణ్యం, రామకృష్ణయ్య, రామలింగా రెడ్డి, శివశంకర్, రెడ్డెప్ప రెడ్డి, లక్ష్మీపతి, సుశీల, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెమింగో ఫెస్టివల్‌ను పండుగ వాతావరణంలో నిర్వహించాలి

కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే విజయశ్రీ

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రానున్న ఫ్లెమింగో ఫెస్టివల్ వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్వర్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఫ్లెమింగో ఫెస్టివల్ వేడుకల నిర్వహణపై వారు సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పులికాట్ సరస్సు, నేలపట్టు పక్షుల అభయారణ్యం సూళ్లూరుపేట నియోజకవర్గంలో పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయని తెలిపారు. 2020 తరువాత ఫ్లెమింగో ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే విజయశ్రీ సూచనలు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారుల భాగస్వామ్యంతో విజయవంతం చేద్దామన్నారు. కార్యక్రమంలో ఎస్వీ జూపార్కు క్యూరేటర్ సెల్వం, సూళ్లూరుపేట డీఎఫ్‌వో, పర్యాటకశాఖ రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ఆధార్ నమోదుకు ప్రత్యేక శిబిరాలు

తిరుపతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో 6 ఏళ్ల లోపు గల పిల్లలకు ఆధార్ నమోదు కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డులు మొదటి దశలో డిసెంబర్ 21 వరకు, రెండవ దశలో 26 నుంచి డిసెంబర్ 28 వరకు నిర్వహిస్తామని అన్నారు. నగరంలోని దోబీ కాలనీ, భగత్ సింగ్ కాలనీ, సప్తగిరి నగర్, భవానీ నగర్, యశోద నగర్, పూసల వీధి, వినాయక నగర్, తాతానగర్, ఎస్.టి.వి.నగర్, నవాబుపేట ప్రాంతాల్లో ఏర్పాటు చేశామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ప్రజలను కోరారు.


ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కలియుగ ప్రత్యక్షదైవం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి సేవలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, వ్యాపారవేత్త అజయ్ ప్రతాప్ గారితో పాటు విదేశీ భక్త బృందం క్రిష్టఫ్, బ్రూనో, జెస్టిన్, ట్రింబ్‌లేమిచెలి, ఎన్.ఆర్.ఐ.లు శ్రీనివాస్, నిహత్ సాయి, ఉష, రోహిత, మధు తదితరులు

‘దేవుడున్నాడు జాగ్రత్త’

తిరుమల చరిత్ర పుస్తకాన్ని పరిచయం చేసిన ఎం.వి.ఆర్.శాస్త్రి


దేవుడున్నాడు జాగ్రత్త పుస్తకాన్ని చూపిస్తున్న ఎం.వి.ఆర్.శాస్త్రి, బుల్లిశెట్టి సత్యనారాయణ

తిరుపతి (లీలామహల్), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తిరుమల చరిత్ర గురించి ఇప్పటి వరకు పుస్తకాల్లో ప్రచురించిన విషయాలతో సమాజం అజ్ఞానంతో రాజ్యమేలుతోందని సీనియర్ జర్నలిస్ట్ ఎం.వి.ఆర్.శాస్త్రి తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి బుల్లిశెట్టి సత్యనారాయణతో కలిసి తిరుమల చరిత్రపై వాస్తవాలు సమాజానికి తెలియజేస్తూ రచించిన ‘దేవుడున్నాడు జాగ్రత్త’ పుస్తకాన్ని ఆయన పరిచయం చేశారు. ఆయన మాట్లాడుతూ తిరుమల చరిత్రను తెలియజేసే పుస్తకం కావడంతో మొదటగా శ్రీవారి పాదాలచెంత ఉంచి తెచ్చామని, త్వరలోనే పుస్తకావిష్కరణ చేస్తామన్నారు. ఈ విషయమై టీటీడీ అధికారులతో చర్చించినట్లు తెలిపారు. తిరుమల కొండపై ఎన్ని ఆరోపణలు జరిగినా, రాజకీయంగా ఏమి జరిగినా భక్తులు పట్టించుకోక ప్రపంచ వ్యాప్తంగా ఆయన దర్శనం కోసం లక్షలాది మంది తరలి వస్తున్నారని, దీనిపై తిరుమల కొండకు ఉన్న భక్తిభావాన్ని ప్రజలందరికీ తెలియజేయాలన్నారు.

ఏడు స్పోర్ట్స్ బైక్‌లు సీజ్



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో స్పోర్ట్స్ బైక్ రేసులు నిర్వహించే వారిపై దాడులు చేసిన పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వారినుంచి దాదాపు ఏడు స్పోర్ట్స్ బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి డీఎస్పీ వెంకటనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం సీఐలు రామయ్య, అలిపిరి ఎస్‌ఐ నాగార్జున రెడ్డి, లోకేష్‌బాబు, సిబ్బంది పలు ప్రాంతాల్లో దాడులు చేశారు. ఇందులో భాగంగా నెంబరు ప్లేట్లు లేని బైక్‌లు నడుపుతున్న ద్విచక్ర వాహనదారులు ఏడు మందికి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. రేసు బైక్‌లపై కేసులు నమోదు చేసి జిల్లా రవాణాశాఖ అధికారులకు ప్రత్యేక లేఖ రాశారు. డీఎస్పీ వెంకటనారాయణ మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై బీఎన్ఎస్ చట్టం, మోటారు వాహనాల చట్టం కింద కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.


తీవ్రమైన చలికి ఫుట్‌పాత్‌పై, ఆలయం ముందున్న జర్మన్ షెడ్‌లో తమ వద్దనున్న దుస్తులనే కప్పుకుని సేదతీరుస్తున్న యాత్రికులు



చ..చ...చ..చలి!


చలిలో చిన్నారులతో భక్తులు

తిరుపతి, తిరుమలల్లో చలిగాలులకు ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. మంగళవారం పగలే చలికి ముడుక్కున్నారు. రాత్రి చలి తీవ్రత మరింత పెరిగింది. తిరుపతి అలిపిరి ప్రాంతంలో ప్లాట్‌ఫారాలనే ఆశ్రయంగా మార్చుకున్నవారి పరిస్థితి వర్ణనాతీతం. దయతో ఎవరో ఇచ్చిన దుప్పట్లలో ముణగదీసుకుని పడుకున్నారు. తిరుమలలో కాటేజీలు దొరకని భక్తుల పరిస్థితి దారుణంగా ఉంది. షెడ్లు, యాత్రికుల వసతి సముదాయాల్లో, కార్యాలయాల ముందు చలికి వణుకుతూ కనిపిస్తున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులతో కొండకు వచ్చిన భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. దర్శనం కోసం కంపార్టుమెంట్లలో వేచి ఉన్న భక్తులు కూడా చలిని తట్టుకోలేకపోతున్నారు. శ్రీవారి పుష్కరిణిలో స్నానమాచరించే భక్తుల సంఖ్య కూడా తగ్గింది. మంగళవారం రాత్రి తిరుమలలో చిరుజల్లులు కూడా జత కావడంతో చలి మరింత పెరిగింది.

- తిరుపతి, తిరుమల, ఆంధ్రజ్యోతి







చలిలో దుప్పట్లు కప్పుకుని నిద్రిస్తున్న దంపతులు, వృద్ధులు, స్వెట్టర్లు, దుస్తులు కప్పుకుని వెళుతున్న యాత్రికులు

స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు త్వరగా పూర్తిచేయాలి

కమిషనర్ మౌర్య



తిరుపతి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ సిటీ నిధులతో తిరుపతి నగరంలో జరుగుతున్న ప్రాజెక్టులను గడువులోపు పూర్తి చేయాలని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. స్మార్ట్ సిటీ నిధులతో జరుగుతున్న వివిధ ప్రాజెక్టుల పనుల పురోగతిపై నిర్మాణ సంస్థల ప్రతినిధులు, స్మార్ట్ సిటీ అధికారులతో మంగళవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, సిటీ ఆపరేషన్ సెంటర్, గరుడ వారధి, మల్టీ లెవెల్ కార్ పార్కింగ్, గ్లో గార్డెన్, క్రికెట్ స్టేడియం తదితర ప్రాజెక్టుల్లో జరుగుతున్న పనుల వివరాలను వివరించారు. ఈ సమావేశంలో స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి, ఎస్ఈ శ్యాంసుందర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్, డీఈలు రాజు, మధు, వెంకటప్రసాద్, డీసీపీ మహాపాత్ర, ఎయికాం ప్రతినిధులు బాలాజి, అనిల్, వివిధ నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రుయాలో ముగిసిన దుకాణాల టెండరు ప్రక్రియ

కనీవిని ఎరుగని రీతిలో టెండరు కొటేషన్లు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రిలో దుకాణాల టెండరు ప్రక్రియను మంగళవారం రుయా అధికారులు పక్కాగా నిర్వహించారు. ఆస్పత్రి పరిధిలోని పది దుకాణాలకు ఇటీవల సీల్డు టెండరుకు దరకాస్తులను ఆహ్వానించారు. దాదాపు 200కు పైగా సీల్డు దరకాస్తులు రాగా, మంగళవారం టెండరు దారుల సమక్షంలో అధికారుల పర్యవేక్షణలో వాటిని ఓపెన్ చేశారు. ఒక్కో దుకాణానికి అధికారులు ఊహించని రీతిలో వంద రెట్లకు పైగా పోటీ పడి మరి కొటేషన్ వేశారు. ఆస్పత్రిలోని అవుట్‌పోస్టు సమీపంలో ఉన్న చిన్నపాటి బంకుకు అధికారులు రూ.2 వేల అద్దెను కేటాయించగా, దానిని రూ.60 వేలకు సీల్డు టెండరు కింద దక్కించుకున్నారు. అదే రీతిలో పది దుకాణాలకు ఊహించని రీతిలో రూ.లక్షల అద్దె చెల్లించేందుకు టెండరు దారులు ముందుకు వచ్చారు. వీరిలో ఎక్కువ మొత్తంలో అద్దె చెల్లించేందుకు సీల్డు టెండరు దాఖలు చేసిన వారికి అధికారులు దుకాణాలను కేటాయించారు. దుకాణాల సీల్డు టెండరు ప్రక్రియలో గందరగోళం నెలకొంటుందనే ఆలోచనతో సూపరింటెండెంట్ రవిప్రభు ముందస్తుగా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఈస్ట్ పోలీసులు అక్కడకు చేరుకొని గట్టి భద్రతా చర్యలు చేపట్టారు. దీంతో టెండరు ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

పరిశుభ్రత ఎక్కడ?

ఉమెన్స్ హాస్టల్ తనిఖీలో ఎస్వీయూ అధికారుల ప్రశ్న


ఉమెన్స్ హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న వీసీ అప్పారావు తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పరిశుభ్రత ఎక్కడ? ఇలా అయితే, విద్యార్థులకు రోగాలు వద్దన్నా రావా? అని హాస్టల్ అధికారులను ఎస్వీయూ అధికారులు ప్రశ్నించారు. ఎస్వీయూ ఉమెన్స్ హాస్టల్ వంటశాల, మెస్‌ను వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడి సదుపాయాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాలను రుచి చూశారు. మెస్, వంటశాలలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఆహారం రుచిగా, పరిశుభ్రంగా ఉండాలన్నారు. మెస్, హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అసిస్టెంట్ ఇంజనీర్ సంగీతం సుబ్రహ్మణ్యం, వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సైకిల్ తొక్కడం ఆరోగ్యానికి మంచిది

పద్మావతి వర్సిటీ వీసీ ఉమ


సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న వీసీ ఉమ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): సైకిల్ తొక్కడం వల్ల వ్యక్తిగత ఆరోగ్యానికీ, పర్యావరణానికీ మేలు కలుగుతుందని పద్మావతి యూనివర్సిటీ వీసీ ఉమ అభిప్రాయపడ్డారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా మంగళవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రారంభించిన అనంతరం వీసీ ఉమ మాట్లాడుతూ.. రోజు వారీ జీవితంలో సైకిల్‌ను వాడేలా చూసుకోవాలన్నారు. లేకపోతే, ఢిల్లీ మాదిరిగా పర్యావరణ కాలుష్యం పేట్రేగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ సమస్యలన్నింటికీ సైకిల్ వాడకం చాలా వరకూ పరిష్కారమని స్పష్టం చేశారు. రిజిస్ట్రార్ రజని, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగ హెడ్ శారా సరోజిని, విద్యార్థులు పాల్గొన్నారు.

రాస్‌చే ముందస్తు క్రిస్మస్ వేడుకలు

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): తిరుపతి రాస్ ప్రధాన కార్యాలయం నిర్వాహకులు మంగళవారం రేణిగుంట పాత చెక్‌పోస్ట్ సమీపంలోని సెయింట్ లూథరన్ చర్చిలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు, చేతికర్రలు పంపిణీ చేశారు. ఫాదర్ విక్టర్,రాస్ సిబ్బంది నాగేశ్వర్, సత్యనారాయణ, రాణి, సుజాత, ఈశ్వరమ్మ, జయలక్ష్మి పాల్గొన్నారు.

పులి ఇటు వచ్చిందా?

ఎస్వీయూ బొటానికల్ గార్డెన్‌ను పరిశీలించిన ఫారెస్టు అధికారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): శేషాచలం అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న ఎస్వీయూలో పులి సంచారం ఏమైనా ఉందా? అనే కోణంలో ఫారెస్టు అధికారులు ఆరా తీస్తున్నారు. వేద వర్సిటీలో గత కొన్ని వారాలుగా పులి సంచారం నేపథ్యంలో ఇప్పటికే ఆ వర్సిటీలో అధికారులు పరిశీలన జరిపారు. ఈ క్రమంలో ఎస్వీయూ శ్రీనివాసా ఆడిటోరియానికి సమీపంలో గల బోటానికల్ గార్డెన్‌లో మంగళవారం వారు తనిఖీలు నిర్వహించారు. పులి పాద ముద్రలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో పరిశీలించారు. గతంలో బొటానికల్ గార్డెన్ సమీపంలో పులి సంచరించిన చరిత్ర ఉంది. దీంతో ఈ ప్రాంతంపై ఫారెస్టు అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. కుక్కల తాకిడి కూడా యూనివర్సిటీలో ఎక్కువగా ఉండటం పులి సంచారానికి ఒక కారణంగా తెలుస్తుంది. అయితే, పులి సంచారపు ఆనవాళ్లు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో పరిశీలన చేశారు. తద్వారా ఎస్వీయూ నివర్సిటీలోనూ విద్యార్థులు, ఉద్యోగులను అప్రమత్తం చేసినట్టు అయ్యింది.


ఎస్వీయూ బొటానికల్ గార్డెన్‌లో తనిఖీ చేస్తున్న ఫారెస్టు అధికారులు

శ్రీవారి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు

సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి జయంతి సభలో వక్తలు


సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి విగ్రహం వద్ద పలువురి నివాళి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వర స్వామి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి అని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి 136వ జయంతి సందర్భంగా తిరుపతిలోని ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. సాయంత్రం అన్నమాచార్య కళా మందిరంలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. శ్రీవారి ఆలయ చరిత్రను వెలికి తీసి సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి గొప్ప సేవ చేశారని కొనియాడారు. ఆయన వెలికి తీసిన తొలి శాసనంలోనే శ్రీవారి ఆలయ చరిత్ర బయటికి వచ్చిందన్నారు. టీటీడీలో సాధారణ అధికారిగా ఉంటూ వెయ్యికి పైగా శాసనాలను వెలికి తీసి పరిష్కరించారన్నారు. డీపీపీ ప్రాజెక్టు అధికారి రాజగోపాల్ మాట్లాడుతూ.. ఆలయ పేష్కార్‌గా ఉంటూ ఎపిగ్రఫిస్టుగా రాగిరేకుల శాసనాలను సేకరించి అనువదించిన ప్రతిభాశీలి సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి కుమార్తె గిరిజాదేవి, మనవడు జడ్డి సీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా షర్మిల జన్మదిన వేడుకలు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు షర్మిల జన్మదిన వేడుకలను తిరుపతిలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఆయన కాంగ్రెస్ నేతలతో కలిసి కేకు కట్ చేశారు. తిమ్మినాయుడుపాళెంలోని మా తెలుగుతల్లి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంచి పెట్టారు. కాంగ్రెస్ నేతలు రాంభూపాల్‌రెడ్డి, వెంకట నరసింహులు, శివశంకర్, సుప్రజ, మురళీకృష్ణ పాల్గొన్నారు.


పండ్లు, స్వీట్లు పంచిపెడుతున్న కాంగ్రెస్ నేతలు



మంగళవారం ఉదయం శుభ్రపరిచారిలా..

చెత్తతీసి.. కల్లాపు చల్లి!

అది తిరుపతి నగరం కొర్లగుంట జంక్షన్ నుంచి పాత కార్పొరేషన్ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రహదారి. ఇంటింటికీ చెత్త సేకరణ జరుగుతున్నా.. కొందరు స్థానికులు ఈ దారి లోని విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మరు వద్ద చెత్త వేస్తున్నారు. ఎంత చెప్పినా ఎవరూ వినిపించుకోలేదు. చివరకు 'ఇచ్చట చెత్త వేయరాదు. వేసినచో రూ.1000 జరిమానా విధించబడును' అని కమిషనరు పేరిట హెచ్చరిస్తూ ఫ్లెక్సీ పెట్టారు. అయినా.. చెత్త వేయడం ఆపలేదు. చివరకు పారిశుధ్య సిబ్బంది వినూత్న ఆలోచనతో ముందుకొచ్చారు. మంగళవారం ఉదయానికంతా అక్కడ 'చెత్త'శుద్ధి చేశారు. పేడ నీటితో కల్లాపు చల్లారు. కుండీల్లో పూలమొక్కలు పెట్టారు. ఇలాగైతే స్థానికుల్లో మార్పు వచ్చి చెత్త వేయరన్న భావనతో ఈ పనులు చేశారు. పారిశుధ్య సిబ్బంది ఆశించిన ఈ మార్పు ప్రజల్లో వస్తే.. తిరుపతి స్వచ్ఛ నగరం అవుతుంది.

- తిరుపతి(జీవకోన), ఆంధ్రజ్యోతి

17 ఇసుక ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ సీజ్



అక్రమంగా ఇసుక తరలిస్తున్నారంటూ మంగళవారం రెవెన్యూ అధికారులకు వచ్చిన ఫిర్యాదుపై దాడి చేశారు. పోలీసుల సహకారంతో 17 ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసినట్లు ఆర్ఐ జైకృష్ణ తెలిపారు. శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డికి అందిన ఫిర్యాదు మేరకు తాము పిల్లపాళ్యం స్వర్ణముఖినది సమీపంలోని ప్రైవేటు భూముల్లో ఇసుక అక్రమ తవ్వకాలపై దాడులు నిర్వహించామన్నారు. ఇసుక తరలిస్తున్న 7 ట్రాక్టర్లు, పది ఖాళీ ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసి గాజులమడ్యం పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. వీఆర్వో విశ్వనాథం ఫిర్యాదు మేరకు ఎస్ఐ సుధాకర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

- రేణిగుంట, ఆంధ్రజ్యోతి




సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమలలో స్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 3 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం నాటి హుండీ ఆదాయం: రూ.3.36 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 62,112

తలనీలాలు సమర్పించినవారు: 22,541




మీ కళ్లెదుట ప్రమాదం జరిగిందా?

కాపాడినందుకు కోర్టుకు తిరగనవసరం లేదు
పోలీసులూ, ఆసుపత్రుల వేధింపులుండవు
కేంద్రం మార్గదర్శకాలు

తిరుపతి(నేరవిభాగం) ఆంధ్రజ్యోతి

రోడ్డు మీద ప్రమాదం జరుగుతుంది. రక్తగాయాల్లో చెల్లాచెదురుగా పడిపోయి ఉంటారు. ఆ దారినపోయేవారు కొందరు ఆగి చుట్టుముడుతారు. కొందరు దూరంగా ఉండి, వివరాలు కనుక్కుంటారు. మరికొందరు వెంటనే మొబైల్ బయటకు తీసి వీడియో తీస్తుంటారు. ఒకరో ఇద్దరో పూనుకుని 108కి ఫోన్ చేస్తారు.

.. రోడ్డు ప్రమాదాల సమయంలో సాధారణంగా కనిపించే దృశ్యం ఇది. గాయపడ్డవారిని తక్షణం తామే ఆసుపత్రికి తరలించే ప్రయత్నం మాత్రం దాదాపుగా ఎవరూ చేయరు. నిజానికి రోడ్డు ప్రమాద సంఘటనల్లో గోల్డెన్ అవర్ కీలకమైనది. అంటే ప్రమాదం జరిగిన గంటలోగా ఆసుపత్రికి చేర్చగలిగితే మరణాలను నిరోధించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. తమ వాహనంలోనో లేదా ఆటోలోనో ఆసుపత్రికి తీసుకువెళ్లే సాహసం జనం చేయరు. అరుదుగా ఏ నాయకులో, అధికారులో చేసినపుడు ఇది వార్త అవుతుంటుంది.



ఎందుకిలా?

ఎందుకంటే మంచి చేసినా అది తమకు అంటుకుంటుందన్న భయం. సమీపంలో ఉన్న ఆసుపత్రికి తీసుకువెళ్తే, తీసుకువెళ్లిన వారి వివరాలు రాసుకుంటారు. ఆ తర్వాత పోలీసు వేధింపులు మొదలవుతాయి. సవాలక్ష ప్రశ్నలు ఎదురవుతాయి. సాక్ష్యంగా కోర్టుకు రమ్మంటారు. మానవత్వంతో చేసిన సాయానికి కోర్టుల చుట్టూ తిరుగుతూ ఉండాలా.. అన్న ఆందోళన వల్లే రోడ్డు ప్రమాద సంఘటనల్లో ప్రజల ఉదాశీనతకు కారణం. ఇటువంటి కారణాలను గుర్తించే కేంద్ర ప్రభుత్వం ఖచ్చితమైన మార్గదర్శకాలను జారీ చేసింది. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ఆ వివరాలను జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలియజేశారు. రోడ్డు ప్రమాద బాధితులకు మానవతా దృక్పథంతో తక్షణం సాయం అందించండి అని ఆయన విజ్ఞప్తి చేస్తున్నారు.

కేంద్రం మార్గదర్శకాలు ఇవీ..

- ప్రమాద బాధితులకు సహాయకారిగా వచ్చిన వ్యక్తిని ఆసుపత్రి సిబ్బందిగానీ, పోలీసులుగానీ వేధించకూడదు. బాధితుడిని తక్షణం ఆసుపత్రిలో చేర్చుకుని వైద్య సేవలు అందించాలి.
- సాక్ష్యం చెప్పండి అంటూ బలవంతం చేయకూడదు.
- సాక్ష్యం చెబుతామని ముందుకు వచ్చిన వారి విచారణ ఒక్క రోజులోనే ముగించాలి. రెండవసారి పిలవకూడదు.

"రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం చేసిన వ్యక్తులకు గౌరవ సూచకంగా రూ 5000 పారితోషికం జిల్లా కలెక్టర్ ఇస్తారు. వారి సేవలను గుర్తిస్తూ యోగ్యతా పత్రం కూడా అందిస్తారు.



రాగిమాను వద్ద పెద్ద మర్యాద స్వాగత సత్కారాలు అందుకుంటున్న పెద్ద జీయర్ స్వామి

పెద్దజీయర్ స్వామికి తిరునక్షత్ర మర్యాద

తిరుమల, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): పెరియ కోయిల్ కేల్వి అప్పన్ శఠగోప రామానుజ పెద్దజీయర్ స్వామి 75వ జన్మదినం సందర్భంగా మంగళవారం పెద్దజీయర్ స్వామికి ఆలయంలో తిరునక్షత్ర మర్యాద జరిగింది. రాగిమాను వద్ద ఇస్తికఫాల్ స్వాగతం లభించింది. మేళతాళాల మధ్య చిన్నజీయర్ స్వామితో కలిసి ఆయన ఆలయం వద్దకు చేరుకున్నారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో శ్రీధర్ మహద్వారం వద్ద స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, డిప్యూటీఈవో లోకనాథం, పేష్కార్ రామకృష్ణ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ఎల్లా




ప్రీతి నిగమ్, నగేష్ కర్నా - ఎల్లా వెంకటేశ్వర్లు

తిరుమల, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. జనసేన పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ బొలిశెట్టి సత్యనారాయణ, సినీనటి ప్రీతి నిగమ్, నగేష్ కర్నా దంపతులు, ప్రముఖ మృదంగ వాయిద్య కళాకారుడు ఎల్లా వెంకటేశ్వర్లు ఉన్నారు.

అ'దృశ్యం'

- భర్త కనబడలేదంటూ పోలీసులను ఆశ్రయించిన భార్య
- దర్యాప్తులో తీగ లాగితే డొంక కదిలిన వైనం
- వీడిన మర్డర్ మిస్టరీ

శ్రీకాళహస్తి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): నేరాలు, చోరీలు చేసి తాత్కాలికంగా కప్పిపుచ్చుకున్నా దొరికిపోక తప్పదు. అలా ఎలక్ట్రీషియన్ హత్య బయట పడటానికి 50 రోజులు పట్టింది. అదృశ్యం కేసుపై విచారణ చేపడితే హత్య విషయం వెలుగులోకి వచ్చింది. మర్డర్ మిస్టరీ కూడా వీడింది. శ్రీకాళహస్తి వన్ టౌన్ సీఐ గోపి తెలిపిన ప్రకారం.. ఏర్పేడు మండలం పల్లం గొల్లపల్లికి చెందిన వెంకటేష్, వసంత దంపతులు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించేవారు. శ్రీకాళహస్తి పట్టణంలోని కొత్తపేటలో కాపురం ఉంటూ స్వగ్రామానికి వెళ్లి వ్యవసాయ పనులు చేసుకుని వచ్చేవారు. అన్నమయ్య జిల్లా పుల్లంపేటకు చెందిన ప్రభాకర్ పదేళ్ల కిందట ఎలక్ట్రీషియన్ పనుల కోసం శ్రీకాళహస్తికి వచ్చాడు. కొత్తపేటలోనే ఓ మిత్రుడితో కలిసి అద్దె గదిలో ఉంటున్నాడు. ఖాళీ రోజుల్లో ఇంటికి వెళ్లి వస్తుండేవాడు. ఈ క్రమంలో వెంకటేష్ కుటుంబంతో ఇతడికి సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. వసంతతో చనువుగా మెలిగేవాడు. ప్రభాకర్, అతడి తరపు బంధువులు పలుమార్లు ఇద్దరిని మందలించినా మార్పు రాలేదు. దీని వల్ల వెంకటేష్, వసంత మధ్య విబేధాలు తలెత్తాయి. నాలుగు నెలల కిందట గొడవ జరగడంతో వెంకటేష్ స్వగ్రామానికి వెళ్లిపోయాడు. వసంత మాత్రం శ్రీకాళహస్తిలోనే ఉన్నారు. ఎలక్ట్రీషియన్ ప్రభాకర్ కారణంగా తన భార్య దూరమైందని వెంకటేష్ ఆగ్రహం పెంచుకున్నాడు. తన భార్య సోదరుడైన ఆటో డ్రైవర్ సుబ్రహ్మణ్యం, అల్లుడు హేమంత్‌కుమార్‌తో కలిసి అతడి అడ్డు తొలగించుకోవాలని పథకం వేశాడు. అక్టోబరు 24న ముగ్గురు కలిసి మద్యం తాగేందుకు రావాలంటూ శ్రీకాళహస్తిలో కొత్తపేట వద్ద ఎలక్ట్రీషియన్ ప్రభాకర్‌ను ఆటో ఎక్కించుకున్నారు. నలుగురూ మద్యం తాగారు. ఆటోలో పల్లం గొల్లపల్లి శివారులోని శ్మశానం సమీపంలోకి వచ్చేసరికి ప్రభాకర్.. నిద్రలోకి జారుకున్నాడు. ముగ్గురూ కలిసి బండరాయితో అతడి తలపై కొట్టి హత్య చేశారు. కాలువ పక్కన మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. నాలుగు రోజులైనా ప్రభాకర్ రాకపోవడంతో.. అద్దె గదిలో ఉండే మిత్రుడు ఆయన భార్యకు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చారు. తన భర్త ప్రభాకర్‌కోసం సుధ పలుచోట్ల ఆరా తీశారు. ఆచూకీ లభించకపోవడంతో నవంబరు 25న శ్రీకాళహస్తి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో వసంతతో సన్నిహితంగా మెలిగేవాడన్న విషయాన్ని గుర్తించారు. ఆ తరువాత లోతుగా కూపీ లాగడంతో ఆమె భర్త, సోదరుడు, అల్లుడు కలిసి ప్రభాకర్‌ను చంపినట్లు నిర్ధారించారు. ఈ మేరకు మంగళవారం ఘటనా స్థలానికి చేరుకుని ప్రభాకర్ అవశేషాలను వెలికి తీసి.. అక్కడే ప్రభుత్వ వైద్యాధికారులతో పోస్టుమార్టం నిర్వహించారు. కాగా, ముగ్గురు నిందితులు ఓ రెవెన్యూ అధికారి వద్ద లొంగిపోయినట్లు తెలిసింది. మొత్తమ్మీద 'అదృశ్యం' కేసులో దర్యాప్తు చేపడితే మర్డర్ మిస్టరీ వీడింది. సినిమా తరహాలో మృతదేహాన్ని పాతిపెట్టడం చర్చనీయాంశంగా మారింది.




మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహిస్తున్న వైద్యులు -ప్రభాకర్ (ఫైల్ ఫొటో)

బ్యాంకులో దోపిడీకి యత్నం

- యువకుడిని పట్టుకుని చితకబాదిన ఖాతాదారులు



రేణిగుంట డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): బ్యాంకులో దోపిడీకి యత్నించిన యువకుడిని స్థానికులు పట్టుకుని కట్టేసి చితకబాదారు. ఈ సంఘటన మంగళవారం సాయంత్రం తిరుపతి- రేణిగుంట రోడ్డులోని ఇండియన్ బ్యాంకులో జరిగింది. కృష్ణతేజ విద్యాసంస్థల ప్రాంగణంలో ఉన్న ఈ బ్యాంకులోకి సాయంత్రం మూసివేసే సమయంలో ఓ యువకుడు ముఖానికి కర్చీఫ్ కట్టుకుని, బ్యాగులో కత్తిని పెట్టుకుని ప్రవేశించాడు. క్యాషియర్ పక్కన ఉన్న అకౌంటెంట్ మెడపై కత్తి పెట్టి డబ్బులు బ్యాగులో వేయాలని బెదిరించాడు. అదే సమయంలో బ్యాంకుకు వచ్చిన ఖాతాదారులు ఆ యువకుడిని మాటల్లో దింపి చాకచక్యంగా పట్టుకున్నారు. బయటకు తీసుకొచ్చి గ్రిల్‌కు కట్టేసి చితకబాదారు. తాను రూ.5 లక్షల అప్పుల పాలయ్యానని, ఆ బాధ తట్టుకోలేక చోరీకి వచ్చినట్లు అతడు చెప్పాడు. తాను లక్ష్మీపురం సర్కిల్‌లో ఉంటానని, శ్రీకాళహస్తి ఆలయం సమీపంలో ఇల్లు ఉందని, డిగ్రీ వరకు చదువుకున్నానని చెప్పాడు. తిరుచానూరు పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా, ఆ యువకుడి పేరు పురుషోత్తం అని పోలీసుల విచారణలో తేలింది. వరదయ్యపాలెం మండలం సదనవారిపల్లెకు చెందిన వాడని పోలీసులు తెలిపారు. మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేసే ఇతడిని.. ఆర్థిక వ్యవహారాల్లో ఉద్యోగం నుంచి తొలగించారు. బ్యాంకు అప్రైజరును బెదిరించిన కేసులో పురుషోత్తంను అరెస్టు చేశారు. గతంలో ఇతడిపై ఎటువంటి నేరచరిత్ర లేదని సీఐ సునీల్‌కుమార్ వెల్లడించారు.

విష జ్వరంతో విద్యార్థి మృతి

- పూడి వంతెన కొట్టుకుపోవడంతో ఇంట్లోనే చికిత్స
- ఆరోగ్యం విషమించి అసువులుబాసిన ఉదయ్



ఉదయ్‌కుమార్ (పాతచిత్రం)

కేవీబీపురం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం పూడి సీకేపురం గ్రామానికి చెందిన విద్యార్థి విష జ్వరంతో మృతి చెందాడు. చిట్టిబాబు, హేమలత దంపతుల రెండో కుమారుడు ఉదయ్‌కుమార్(14) వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామం వద్ద కాజ్‌వే కొట్టుకుపోయింది. దీంతో ఇంటి వద్దే అందుబాటులో ఉన్న మందులతో సరిపెట్టారు. శనివారం జ్వరం ఎక్కువ కావడంతో ఆస్పత్రికి తీసుకెళ్దామని బయలు దేరారు. యేరు ఉధృతంగా పారుతుండడంతో వెనుదిరిగారు. ఆదివారం తాత్కాలికంగా వంతెన పునరుద్ధరించడంతో కేవీబీపురం పీహెచ్‌సీకి తీసుకెళ్లి పరీక్షల అనంతరం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి అక్కడి నుంచి తిరుపతికి తరలించారు. తిరుపతిలో వైద్యం పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఉదయ్‌కుమార్ రాగిగుంట పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు.

నకిలీ గుర్తింపు కార్డులు తయారు చేస్తే పదేళ్ల జైలు శిక్ష

తిరుమల, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనం కోసం నకిలీ గుర్తింపు కార్డులు తీసుకొచ్చినా.. గుర్తింపు కార్డుల్లో కేడర్ మార్చినా, ఒకరి స్థానంలో మరొకరు వచ్చినా పదేళ్ల జైలు శిక్ష పడుతుందని తిరుమల పోలీసులు మంగళవారం ఓ ప్రకటన ద్వారా హెచ్చరించారు. కన్నియకుమారికి చెందిన రిటైర్డ్ లెఫ్టినెంట్ కల్నల్ విశ్వేశ్వరప్రసాద్ ప్రస్తుతం సౌత్‌జోన్ మిలటరీ క్యాంటీన్లకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఈయన స్వామి దర్శనం కోసం కొందరిని సంప్రదించగా.. ఇతడి గుర్తింపుకార్డును వీరు బ్రిగేడియర్ అధికారిగా నకిలీది సృష్టించి బ్రేక్ దర్శన టికెట్లను పొంది విక్రయించారు. ఈఅక్రమాన్ని సోమవారం గుర్తించిన విజిలెన్స్ అధికారులు వన్‌టౌన్ పోలీసులకు అప్పగించగా వారు కేసు నమోదు చేశారు. ఈసందర్భంగా ఈ ప్రకటన విడుదల చేశారు.

పీఎఫ్ జమచేయలేదని..

- ఎలక్ట్రిక్ బస్సు డ్రైవర్ల విధుల బహిష్కరణ

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పీఎఫ్ నగదు జమ చేయలేదని తిరుమల ఘాట్‌లో నడిచే ఆర్టీసీకి చెందిన 50 ఎలక్ట్రిక్ బస్సుల డ్రైవర్లు మంగళవారం విధులు బహిష్కరించారు. ఉదయం 6గంటలకు బయల్దేరాల్సిన బస్సులు అలిపిరి డిపోకే పరిమితమయ్యాయి. ఎలక్ట్రిక్ బస్సులను నిర్వహణ చూసే పాత, కొత్త సంస్థలతో ఇంచార్జ్ డీపీటీవో జగదీష్, డిపో మేనేజర్ హరిబాబు చర్చించారు. పదిరోజుల్లో పీఎఫ్ జమ చేయిస్తామని డ్రైవర్లకు హామీ ఇచ్చారు. పాత బకాయిల సమస్యను కూడా పరిష్కరించడంతో మధ్యాహ్నం 3గంటల డ్రైవర్లు విధులకు హాజరయ్యారు. సప్తగిరి ఎక్స్‌ప్రెస్ బస్సులను చెన్నై, వేలూరులకు పంపకుండా తిరుమల-తిరుపతి మధ్య తిప్పారు.



అలిపిరి డిపోకే పరిమితమైన ఎలక్ట్రిక్ బస్సులు

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి



కలెక్టర్ వెంకటేశ్వర్, పక్కనే ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఎస్పీ సుబ్బరాయుడితో కలిసి రహదారి భద్రతపై ఆయన అధికారులతో సమీక్షించారు. తనపల్లి జంక్షన్, ఆర్‌సీపురం జంక్షన్, వకుళమాత జంక్షన్ తదితర ప్రాంతాల్లో సోలార్ బ్లింకర్లు, సైన్‌బోర్డు సూచికలు, పాదచారులు రోడ్డు దాటేందుకు మార్కింగ్, సోలార్ హైమాస్ట్ లైట్లు సత్వర ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భాకరాపేట ఘాట్‌తో పాటు జిల్లాలో సుమారు 100 ప్రమాదకర రహదారి బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి, ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన కార్యాచరణపై సమీక్షించారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్పీ సుబ్బరాయుడు సూచించారు. నగరంలో ట్రాఫిక్ పెరిగిన నేపథ్యంలో భారీ వాహనాలను అనుమతించే సమయ నిబంధనలను నిర్ధారించేందుకు రవాణాశాఖ, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా సమీక్షించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. జిల్లా రవాణాశాఖ అధికారి మురళీమోహన్, పోలీసు, రవాణాశాఖ అధికారులు పాల్గొన్నారు.

రైల్వే హైవే భూసేకరణ వేగవంతం చేయాలి

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులు, రైల్వేప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి పనుల పురోగతిపై జేసీ శుభంబన్సల్‌తో కలిసి వర్చువల్ విధానంలో అధికారులతో సమీక్షించారు. భూసేకరణలో వచ్చే సమస్యలను ఎప్పటికపుడు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, ఎన్‌హెచ్ఏఐ పీడీలు, గూడూరు సబ్‌కలెక్టరు రాఘవేంద్ర మీనా, ఆర్డీవోలు రామ్మోహన్, కిరణ్మయి, భానుప్రకాష్‌రెడ్డి, సంబంధిత మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ టెక్నీషియన్ నెట్‌వర్కింగ్ అండ్ స్టోరేజ్‌పై నైపుణ్య శిక్షణ

తిరుపతి(విద్య), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ నిర్వహిస్తున్నట్టు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి కౌశల్వి కాస్యోజన (పీఎంకేవీవై)4.0 ద్వారా జిల్లాలో నిరుద్యోగ యువతకు పరిశ్రమలకు కావల్సిన నైపుణ్యాలకు అనుగుణంగా స్కిల్‌హబ్‌లలో శిక్షణ, ఉపాధి అవకాశాలను రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ కల్పిస్తోందని తెలిపారు. జిల్లాకు చెందిన స్కిల్‌హబ్ ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలలో 'అసిస్టెంట్ టెక్నీషియన్ - నెట్‌వర్కింగ్ అండ్ స్టోరేజీ' కోర్సుకు సంబంధించి శిక్షణ ప్రారంభించినట్టు వెల్లడించారు. 210 గంటల కాలవ్యవధి కలిగిన ఈ కోర్సుకు 10వ తరగతి, ఆపైన విద్యార్హతలు కలిగివారు అర్హులన్నారు. 81435 76866, 99851 29995 నంబర్లలో సంప్రదించాలని, అలాగే, forms.gle/XeQyn5D7DUWHd3sd6 లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు.

షార్‌లో ఆక్టోపస్ బృందం



ఆక్టోపస్ బృందంతో తహసీల్దార్ నరసింహారావు, ఎస్ఐ శ్రీకాంత్

సూళ్లూరుపేట, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌కు మంగళవారం ఆక్టోపస్ బృందం చేరకుంది. డీఎస్పీ రాంబాబు ఆధ్వర్యంలో 52మంది ఆక్టోపస్ సిబ్బంది షార్ పరిధిలో ఉన్న సముద్ర మార్గంతో పాటు ఇతర ప్రాంతాల్లో మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు.తీవ్రవాదులు షార్‌లోకి ప్రవేశించినప్పుడు,సముద్ర మార్గం గుండా చొరబాటుదారులు వచ్చినప్పుడు ఏ విధంగా ఎదుర్కోవాలో ఆక్టోపస్ బృందం మాక్‌డ్రిల్ నిర్వహించనుంది. ఆక్టోపస్ బృందానికి తహశీల్దార్ ఎస్‌వి.నరసింహారావు, శ్రీహరికోట ఎస్ఐ శ్రీకాంత్ స్వాగతం పలికారు.

'వైష్ణవి'కి కార్మికుల కాపలా

- మద్దతు తెలిపిన టీడీపీ నేతలు

పెళ్లకూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వైష్ణవి డెయిరీని యాజమాన్యం వదిలేసి వెళ్లడంతో కార్మికులు, ఉద్యోగులు షిఫ్టుల విధానంలో కాపలా కాస్తున్నారు. తిరుమల లడ్డూ ప్రసాదానికి వాడే నెయ్యి కల్తీ చేశారనే కేసులో సిట్ బృందం ఇక్కడకు వచ్చి విచారించడం.. ఉద్యోగులను, కార్మికులను వదిలి యాజమాన్యం వెళ్లిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మంగళవారం కంపెనీ వద్దకు కార్మికులు, ఉద్యోగులు వెళ్లగా.. సెక్యూరిటీ సిబ్బంది కూడా లేరు. దీంతో పరిశ్రమకు కాపలా ఉండి ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని భావించిన కార్మికులు రెండు షిఫ్టులుగా అక్కడ ఉంటున్నారు. స్థానిక టీడీపీ నాయకులు వేలూరు హరినాయుడు, తాళ్ల యుగంధర్‌గౌడ్ మంగళవారం వీరికి మద్దతు తెలిపారు. కాగా, సోమవారం యాజమాన్యంపై పోలీసులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో మంగళవారం నాయుడుపేట సీఐ సంగమేశ్వరరావు తన సిబ్బందితో కలసి కంపెనీని సందర్శించి.. పరిశీలించారు.



కార్మికులకు మద్దతు తెలుపుతున్న టీడీపీ నేతలు

ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు

- రూ.6 లక్షల జరిమానా

మంగళం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరికి ఐదేళ్ల జైలుశిక్షతోపాటూ ఒక్కొక్కరికి రూ.6లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు తిరుపతి న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పునిచ్చినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ ప్రకారం వివరాలిలా ఉన్నాయి. తిరుపతి అటవీరేంజ్‌లోని తిమ్మినాయుడుపాలెం బీట్ పరిధిలో ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతూ పూతలపట్టుకు చెందిన పులికంటి శ్రీరాములు, తిరుపతి రూరల్ మండలం తిరుచానూరుకు చెందిన దాసరి రమణయ్యపై టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో నిందితులకు ఐదేళ్ల జైలుశిక్షతో పాటూ ఒక్కొక్కరికి రూ.6 లక్షల జరిమానా విధించారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడే వారికి ఈ తీర్పు గుణపాఠంగా నిలుస్తుందని టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడే వారికి ఐదేళ్ల నుంచి గరిష్ఠంగా జీవితకాలం వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉందని హెచ్చరించారు. శిక్షపడ్డ ఇద్దరినీ నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించామన్నారు.

పది నెలల బాలుడి గొంతులో ఇరుక్కున్న బ్యాటరీ

- స్విమ్స్‌లో శస్త్ర చికిత్సతో తొలగింపు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రిమోట్‌లకు ఉపయోగించే బ్యాటరీతో పది నెలల బాలుడు ఆడుకుంటూ మింగడంతో గొంతులో ఇరుక్కుపోయింది. స్విమ్స్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం ఆధ్వర్యంలో అతిక్లిష్టమైన శస్త్ర చికిత్స చేసి బ్యాటరీని తొలగించినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ మంగళవారం తెలిపారు. శ్రీకాళహస్తికి చెందిన ఈ బాలుడిని కుటుంబ సభ్యులు స్విమ్స్‌కు తీసుకొచ్చారన్నారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ శివరామకృష్ణ ఆధ్వర్యంలో వైద్యుల పర్యవేక్షణలో అధునాతన వైద్య పరిజ్ఞానంతో బాలుడికి శస్త్ర చికిత్స చేశామన్నారు. అనంతరం బాలుడు పూర్తి ఆరోగ్యంగా కోలుకోవడంతో మంగళవారం బాలుడ్ని డిశ్చార్జి చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వెంకటరామిరెడ్డి, చంద్రమౌళీశ్వరన్, మనోజ్‌కృష్ణ, తేజస్విని, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులకు 988 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం 53 రెవెన్యూ సదస్సులు నిర్వహించగా, 988 అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. భూ ఆక్రమణలపై 29, ఇళ్ల స్థలాలపై 124, అసైన్‌మెంట్ భూములపై 83, క్యాస్ట్ వెరిఫికేషన్ 15, రీసర్వే 21, ల్యాండ్ గ్రాబింగ్ 2, ఆర్‌వోఆర్‌పై 473, ఇతర విషయాలకు సంబంధించి 167 వచ్చాయన్నారు. వాటిలో 15 అక్కడికక్కడే పరిష్కరించినట్లు తెలిపారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో పెన్షనర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం ప్రశాంత జీవనం సాగించాలన్నారు. రియాజ్ అహ్మద్, మహబూబ్ బాషా, మోహన్, శ్రీనివాసులు, అరుణ్‌కుమార్, సురేష్‌కుమార్, భాస్కర్ రావు, పురుషోత్తం, గోను శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం



వెంకటరాజు (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నిర్వహిస్తున్న నేత్రదాన కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. మంగళవారం సూళ్లూరుపేట పట్టణం సూళ్లూరు నాగరాపురంలో నివాసం ఉంటున్న ఓంకారం వెంటకరాజు(90) మృతి చెందారు. కుటుంబ సభ్యుల అంగీకారంలో ఆయన కార్నియాలను సేకరించి చెన్నై శంకర నేత్రాలయకు అందజేశారు. దీంతో ఆచార్య భరద్వాజ సేవా సంస్థ నిర్వహిస్తున్న నేత్రదానం 450కి చేరింది. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు ఎంఎం చంద్రబాబు, అలపాటి అశోక్‌కుమార్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతలను టీడీపీలో చేర్చుకోం: కురుగొండ్ల



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణ, పక్కన బీజేపీ నేత ఎస్ఎస్ఆర్ నాయుడు, టీడీపీ నేత రావి మస్తాన్‌నాయుడు, జనసేన నేత తోట కృష్ణయ్య

వెంకటగిరి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అధికారం కోల్పోయి ఆరు నెలలు తిక్కముందే కొంతమంది వైసీపీ శ్రేణులు సిగ్గు విడిచి టీడీపీ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ పార్టీలో చేరుతున్నట్లు మీడియా ద్వారా ప్రకటించుకోవడం సిగ్గుచేటని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ తమ కార్యాలయాలకు రావద్దని పదేపదే చెబుతున్నా కొంతమంది వైసీపీ నేతలు గుంపులో కలిసిపోయి వచ్చి తనకు శాలువాలు కప్పి పార్టీలో చేరినట్లు ప్రకటించుకోవడం సిగ్గుచేటన్నారు. తన ఇంటికి వైసీపీ నేతలెవ్వరూ రావద్దని, వచ్చినా పార్టీలో చేర్చుకొనే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. వైసీపీ నేతలు వచ్చి తనకు కండవా కప్పుతుంటే టీడీపీ కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారని, తమకు సంస్కారం ఉంది కాబట్టే వారిని ఏమీ అనకుండా పంపించి వేస్తున్నామని చెప్పారు. అభివృద్ధిలో పార్టీల కతీతంగా పనిచేస్తామే కానీ వైసీపీ నేతలను మాత్రం టీడీపీలో చేర్చుకొనే ప్రసక్తే లేదన్నారు. టీడీపీలో కష్టపడి పనిచేసిన వారందరికీ పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని అన్నారు. ఎన్నికలకు ముందు తమ పార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వైసీపీ నేతలపై చట్టం ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. సమావేశంలో బీజేపీ నేత ఎస్ఎస్ఆర్ నాయుడు, టీడీపీ నేతలు రావి మస్తాన్ నాయుడు, జనసేన నేత తోట కృష్ణయ్య పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

చీమలవారి కాజ్‌వేను యుద్ధప్రాతిపదికన నిర్మిస్తాం



కాజ్ వే పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

వడమాలపేట, డిసెంబర్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణానికి సమీపంలో ఇటీవల కురిసిన భార్షాలకు కుంగిన చీమలవారి వంక కాజ్‌వేను మళ్లీ నిర్మిస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు. మంగళవారం ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్‌తో కలిసి దెబ్బతిన్న కాజ్‌వేను ఆయన పరిశీలించారు. ప్రస్తుతం మరమ్మతులను చేపట్టి రాకపోకలు పునరుద్ధరిస్తామన్నారు. తరువాత బ్రిడ్జి నిర్మిస్తామన్నారు. వేమాపురం వద్ద ఊట నీళ్లతో నిండుతున్న రైల్వే అండర్ బ్రిడ్జికి సంబంధించి అధికారులు నివేదిక అందించాలని చెప్పారు. ఎస్వీపురం రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద రోడ్డు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరగా పరిశీలించాల్సిందిగా అర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు.

ఎక్సైజ్ కార్యాలయాన్ని ఖాళీ చేయించండి

● కోర్టును ఆశ్రయించిన భవన యజమాని



పుత్తూరు అర్బన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎక్సైజ్‌శాఖ కార్యాలయాన్ని ఖాళీ చేయాలంటూ భవన యజమాని ఒత్తిడి చేస్తున్నారు. 2015 నుంచి నారాయణవనం రోడ్డులోని ఓ అద్దె భవనంలో ఎక్సైజ్ కార్యాలయం కొనసాగుతోంది. అద్దె భవనాల్లో కార్యకలాపాలు కొనసాగించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఎక్సైజ్ కార్యాలయానికి గతంలో చినరాజకుప్పం వద్ద స్థలం కేటాయించినప్పటికీ మౌలిక సదుపాయాలు లేవంటూ అప్పటి అధికారులు ఆ స్థలాన్ని నిరాకరించారు. ఇప్పుడు ఆ స్థలమైనా కేటాయించాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు. పుత్తూరు పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతుండడంతో అద్దె భవనాలకు డిమాండ్ పెరిగింది. ఈ క్రమంలో గతంలో ప్రభుత్వం నిర్దేశించిన అద్దె సరిపోదంటూ, పెంచాలని లేదంటే ఖాళీ చేయలంటూ భవన యజమాని గతంలో ఒత్తిడి చేశారు. దీనికితోడు సకాలంలో అద్దె చెల్లించకపోవడంతో భవన యజమాని కోర్టును ఆశ్రయించారు. భవన నిర్మాణం జరిగి 25 సంవత్సరాలకు పైగా గడిచిందని, మరమ్మతులు చేయించుకోవాలని పేర్కొన్నారు. ఎక్సైజ్ కార్యాలయం ఖాళీ చేయించి తన భవనం తనకు త్వరితగతిన అప్పగించేలా ఉత్తర్వులు జారీ చేయాలని భవన యజమాని వెంకటరాయ శెట్టి కేసు దాఖలు చేశారు. కోర్టు నుంచి కూడా ఎక్సైజ్ అధికారులకు నోటీసులు అందాయి. కాగా, పుత్తూరు పట్టణ పరిధిలోని ఎన్జీవో కాలనీలో ఇరిగేషన్ శాఖకు చెందిన వెదురుకుప్పం - కార్వేటినగరం డివిజన్ కార్యాలయంగా ఏర్పాటు చేసుకున్నప్పటికీ వినియోగంలో లేకపోవడంతో ఆ కార్యాలయాన్ని తమకు కేటాయించాలని ఆ శాఖ అధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం.

భూమికి హక్కులు కల్పించండి

పుత్తూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): తరతరాలుగా అనుభవిస్తున్న వ్యవసాయ భూములకు హక్కులు కల్పించాలని మంగళవారం తిరుమలకుప్పంలో జరిగిన రెవెన్యూ సదస్సులో రైతులు అర్జీలను అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అడంగల్ రికార్డులలో పేర్కొన్న ప్రకారం అటవీశాఖ భూమిగా నమోదై ఉన్నందున ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఆర్ఓఆర్‌కు 47 వినతులు, ఇళ్ల పట్టాలకు 26, ఎఫ్ లైన్‌కు 16, నష్టపరిహారానికి వినతులందాయి. ఈ కార్యక్రమంలో ఆర్ఐ తిరుమలసాయి, మండల సర్వేయరు శేషమరాజు పాల్గొన్నారు.

పన్నులు సరే... వసతులెక్కడ?



ఇళ్ల మధ్యలో నిలిచిఉన్న వర్షం నీరు

పుత్తూరు టౌన్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): తాగునీరు, వీధిదీపాలు, ఖాళీ స్థలాలు, చెత్త పన్ను, కొళాయి పన్ను పేర్లతో పలు రకాలుగా పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు వసతులు కల్పించడంలో మాత్రం శ్రద్ధ చూపడం లేదని పుత్తూరు పట్టణవాసులు వాపోతున్నారు. మౌలిక వసతుల కల్పనలో అధికారులు విఫలమవుతున్నారంటూ మండిపడుతున్నారు. చిన్నపాటి వర్షాలకే పలు మురుగునీటి కాల్వలు పొంగి ప్రవహిస్తున్నాయి. వర్షం నీరు వీధుల్లో అక్కడక్కడ నిల్వ ఉండి దోమలకు నిలయంగా మారి జ్వరాల భారిన పడతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు కాల్వల్లో చెత్త కదిలేలా చూడాలని, దోమల మందు పిచికారీ చేయాలని, వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టాలని, సిమెంటు రోడ్లు నిర్మించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఆదాయ వనురులు పెంపొందించండి

పుత్తూరు టౌన్/ వడమాలపేట, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో ఆదాయ వనరులు పెంపొందించుకునేందుకు భాగస్వాములు కావాలని జిల్లా ఉప పంచాయతీ కార్యనిర్వహణాధికారి జుబేదా చెప్పారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సర్పంచులకు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. మౌలిక వసుతుల కల్పన, విద్య, వైద్యం, విద్యుత్తు, తాగునీటి సౌకర్యాల కల్పనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ మునివేలమ్మ, ఎంపీడీవో రమేష్‌బాబు, మండల పంచాయతీ అధికారి దేవిక, ఏపీఎం, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. వడమాల పేట ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శేషగిరిరావు ఆధ్వర్యంలో సర్పంచులకు, ఎంపీడీవో సభ్యులకు, సచివాలయ సిబ్బందికి విధులు, బాధ్యతలు, పౌరసేవలపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ దయాసాగర్, ఏవో హరినాథ్, బాబు, ఏవో రామ్మోహన్ రావు, రిసోర్స్ పర్సన్ కిశోర్ కుమార్ పాల్గొన్నారు.

బాల కార్మికులను వినియోగిస్తున్న రెండు దుకాణాలపై కేసులు

రేణిగుంట డిసెంబర్ 17,(ఆంధ్రజ్యోతి): బాల కార్మికులుగా వినియోగిస్తున్న రెండు దుకాణాలపై సహాయ కార్మిక అధికారి కేసులు నమోదు చేశారు. మంగళవారం ఆపరేషన్ స్వేచ్ఛలో భాగంగా పట్టణంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శ్రీమాన్ నారాయణ ఆధ్వర్యంలో కార్మిక శాఖ, చైల్డ్‌లైన్, ఐసీడీఎస్, ఎన్జీవోలు సమన్వయంగా దాడులు నిర్వహించారు. పట్టణంలోని ఓ రెడీమేడ్ దుకాణం, సూపర్ మార్కెట్‌లో ముగ్గురు బాల కార్మికులను వినియోగించడానికి గుర్తించి చైల్డ్‌యాక్ట్ ప్రకారం రెండు కేసులు నమోదు చేశారు.

ఇంధన పొదుపుతో భావితరాలకు వెలుగులు



సూళ్లూరుపేటలో ఇంధన పొదుపు వారోత్సవాలను ఆవిష్కరిస్తున్న ఈఈ శ్రీనివాసులు, ఏడీఈ శేఖర్, ఏఈలు మురళి, జగదీష్



వెంకటగిరి సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ రవిచంద్ర, ఏఈలు జయచంద్రారెడ్డి, అశోక్ కుమార్ రెడ్డి, అశోక్

సూళ్లూరుపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇంధనాన్ని పొదుపుగా వినియోగించి భావితరాలకు వెలుగులు పంచుదామని నాయుడుపేట డివిజన్ డిస్కం ఈఈ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం సూళ్లూరుపేట డిస్కం కార్యాలయం వద్ద జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహించారు. ముందుగా ఇంధన పొదుపు వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్‌ను పొదుపు చేసేలా ప్రజల్లో అవగాహన తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏడీఈ శేఖర్, ఏఈలు మురళి, జగదీష్, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్ (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాలకేంద్ర వద్దనున్న విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో మంగళవారం విద్యుత్ పొదుపుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఈ ముని రవిచంద్ర మాట్లాడుతూ నేటి విద్యుత్ పొదుపే రేపటి భావితరాల వెలుగులకు సాకారం అవుతుందన్నారు. ఇంటి నిర్మాణాల్లో వాడే వైర్లు, ఇతర ఎలక్ట్రికల్ సామగ్రి నాణ్యమైనవి ఉపయోగిస్తే విద్యుత్ పొదుపు చేసే అవకాశం ఉంటుందన్నారు. ఒక ఏసీ 30 ఫ్యాన్‌లతో సమానమని తెలిపారు. అవసరాన్ని బట్టి ఏసీ వాడుకోవాలని సూచించారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం లబ్ధిదారులకు సబ్సిడీపై బ్యాంకు రుణాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఏఈలు జయచంద్రారెడ్డి, అశోక్ కుమార్ రెడ్డి, అశోక్, జూనియర్ ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ ఇందన పొదుపు వారోత్సవాలు నిర్వహించారు. విద్యుత్ పొదుపుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి ప్రతిభ కనపరచిన వారికి విద్యుత్‌శాఖ ఈఈ శ్రీనివాసులు బహుమతులు, మొమెంటోలు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్ వర్మ, డీఈ వరప్రసాద్‌రెడ్డి, ఏఈలు శివశంకర్, హరికృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి జంప్‌రోప్ పోటీలకు నెలబల్లి విద్యార్థులు



జాతీయ స్థాయి జంప్‌రోప్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

చిల్లకూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి జంప్‌రోప్ పోటీలకు నెలబల్లి రెట్టపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయరాలు విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 14,15 తేదీల్లో సత్యసాయి జిల్లా, కదిరిలో జరిగిన జంప్‌రోప్ రాష్ట్రా స్థాయి పోటీల్లో తమ పాఠశాలకు చెందిన 9మంది విద్యార్థులకు పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని, వీరు రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీడీ మస్తాన్ బీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థోపెడిక్ ఉచిత వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ జగదీష్

వెంకటగిరి టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోడు నాగేశ్వరరావు ఇంటి వద్ద మంగళవారం ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు, తిరుపతిలోని బర్డ్ ఆస్పత్రి మాజీ డైరెక్టర్ డాక్టర్ జగదీష్ ఆధ్వర్యంలో ఆర్థోపెడిక్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 60 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగదీష్ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో విశ్రాంత సమయంలో మోకాళ్లు, వెన్ను సమస్యలతో పాటు చిన్నపిల్లలకు పలు రకాల వ్యాధులకు చికిత్స చేస్తున్నామని చెప్పారు. ఈనెల 26న కూడా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొండ చిలువ దాడిలో పెంపుడు కుక్క మృతి



మృతి చెందిన కుక్క

కోట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కోట మండలం మద్దాలిలో మంగళవారం తెల్లవారుజామున కొండచిలువ హడలెత్తించింది. స్థానికుల కథనం మేరకు... మద్దాలిలో వెంకటేశ్వర్లు అనే రైతు స్థానికంగా ఉన్న చెరువు పక్కన ఇల్లు కట్టుకొని నివాసం ఉంటున్నాడు. మంగళవారం రాత్రి వెంకటేశ్వర్లు తన పెంపుడు కుక్కను ఇంటి బయట వదిలి లోపల నిద్రించాడు. తెల్లవారుజామున కుక్క అరుపులు వేయడంతో వెంకటేశ్వర్లుకు బయటకు వచ్చి చూడగా పెద్ద కొండచిలువ కుక్క తలను మింగుతూ ఉండటాన్ని గుర్తించి భయాందోళనకు గురయ్యాడు. గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు ఘటనాస్థలికి చేరుకోవడంతో కొండచిలువ ఒక్కసారిగా కుక్కను వదిలేసి పక్కనే ఉన్న చెరువులో దూకి నీళ్లలోకి జారుకుంది. అప్పటికే కుక్క చనిపోయి ఉంది.

తాళం వేసివున్న ఇంట్లో చోరీ

తడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తాళంవేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. గ్రద్దగుంట గ్రామానికి చెందిన రవి కుటుంబం సోమవారం రాత్రి సమయంలో ఇంటి సమీపంలోని ఓ గదిలో నిద్రించారు. అర్ధరాత్రి సమయంలో దొంగలు తాళాలను పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలో ఉన్న సుమారు 20 గ్రాముల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం బాధితులు చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అదుపుతప్పి కారు బోల్తా

చిట్టమూరు, డిసెంబర్ 17(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండలం మొలకలపూడి మలుపు వద్ద మంగళవారం సాయంత్రం ఓ కారు బోల్తా కొట్టింది. చెన్నై ప్రాంతానికి చెందిన ఐదుగురు యువకులు మంగళవారం ఉదయం తూపిలిపాళెం బీచ్‌కు వెళ్లారు. పూటుగా మద్యం సేవించిన యువకులు తిరుగు ప్రయాణంలో అతి వేగంగా కారు నడపుతుండగా మొలకలపూడి మలుపు వద్ద అదుపు తప్పి అడవిలోకి దూసుకెళ్లి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న యువకులకు స్వల్ప గాయాలయ్యాయి.


చంద్రబాబు రైతు పక్షపాతి: నెలవల



నెలవల సుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న పెళ్లకూరు మండలంలోని కూటమి నాయకులు

నాయుడుపేట టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతుల పక్షపాతి అని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం రాత్రి పెళ్లకూరు మండలంలో సాగునీటి సంఘాల అభ్యర్థులుగా గెలిచిన ఐదుగురు బీజేపీ అభ్యర్థులు నెలవల సుబ్రహ్మణ్యంను శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పెళ్లకూరు మండలం టీడీపీ అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, కూటమి నాయకులు ఎద్దల నరేంద్రరెడ్డి, ఆదినారాయణరెడ్డి, సుబ్బులయ్య, మురళి, నరసింహ, రవి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్‌బాబు, పక్కన ఎంపీపీ ధనలక్ష్మి, ఉపాధి ఏపీడీ వరప్రసాద్, ట్రైనింగ్ అధికారి వెంకటేశ్వర్లు

నాయుడుపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో సురేష్‌బాబు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. గామ పంచాయతీల అభివృద్ధిపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా పంచాయతీల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ధనలక్ష్మి, ఎన్ఆర్‌జీఎస్ ఏపీడీ వరప్రసాద్, ట్రైనింగ్ లింక్ అధికారి వెంకటేశ్వర్లు, సర్పంచులు, మండలస్థాయి అధికారులు, కార్యదర్శులు, పాల్గొన్నారు.

వాకాడు(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్త్రీశక్తి భవనంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో అన్నపూర్ణరావు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి తోడ్పాడాలని కోరారు. గ్రామంలో పరిసరాలు పరిశుభ్రంగా ఆహ్లాదకరంగా ఉండేలా ప్రణాళికలు రూపొందించుకొని వాటి కృషికి ప్రయత్నించాలన్నారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బాలాయపల్లి(ఆంధ్రజ్యోతి) స్థానిక వెలుగు కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బందికి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వినీల్ కుమార్, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ మోహన్ రాజు, పీడీపీవో షంషాద్ బేగం తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్(ఆంధ్రజ్యోతి): ప్రతి పంచాయతీ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలనుసాధించాలని ఎంపీడీవో కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ తంబిరెడ్డి తనూజా తదితరులు పాల్గొన్నారు.

కోట (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ ఇచ్చారు. పంచాయతీలో సుస్థిరాభివృద్ధి సాధనకు ఏఏ అభివృద్ధి పనులు చేయాలో వివరించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట, నెల్లూరు మెము రైళ్ల వేళల్లో మార్పులు

పెరంబూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక మూర్ మార్కెట్ కాంప్లెక్స్ నుంచి బయల్దేరే మెము రైళ్లలో మార్పులు చేసినట్టు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

- మూర్ మార్కెట్ కాంప్లెక్స్-సూళ్లూరుపేట మెము తెల్లవారుజామున 5.15 గంటలకు బదులు 5.40 గంటలకు బయల్దేరుతుంది.
- నెల్లూరు-సూళ్లూరుపేట మెము ఉదయం 10.05 గంటలకు బదులు 10.30 గంటలకు బయల్దేరుతుంది.
- మూర్ మార్కెట్ కాంప్లెక్స్-గుమ్మిడిపూండి సబర్బన్ రైలు తెల్లవారుజామున 5.40కు బదులు 5.20 గంటలకు బయల్దేరుతుందని, ఈ మార్పు మంగళవారం నుంచి అమలుకు వచ్చిందని దక్షిణ రైల్వే తెలిపింది.

పక్షుల పండుగ నిర్వహణపై కలెక్టర్‌తో ఎమ్మెల్యే విజయశ్రీ చర్చ



కలెక్టర్ వెంకటేశ్వర్, టూరిజం రీజినల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, జిల్లా అధికారి జనార్దన్ రెడ్డి, డీఎఫ్‌వో హారికతో చర్చిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట వేదికగా జరిగే పక్షుల పండుగ నిర్వహణపై జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జిల్లా అధికారులతో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మంగళవారం చర్చించారు. ఏటా నిర్వహించే పక్షుల పండుగను వైసీపీ హయాంలో నాలుగేళ్ల పాటు నిర్వహించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే విజయశ్రీ పక్షుల పండగ నిర్వహణకు నిధులు కేటాయించాలని సీఎం చంద్రబాబుకు రెండు సార్లు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌తో పాటు టూరిజం శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రమణ ప్రసాద్, జిల్లా టూరిజంశాఖ అధికారి జనార్దనరెడ్డి, సూళ్లూరుపేట డీఎఫ్‌వో ఈ.హారికతో సమావేశమైన ఎమ్మెల్యే పక్షుల పండుగ నిర్వహణపై చర్చించారు.

విశ్రాంత ఉద్యోగుల భవనానికి బీరువా వితరణ



విశ్రాంత ఉద్యోగుల భవనానికి బీరువా అందజేస్తున్న వెంకటేశ్వర్లు, పక్కన పేర్నాటి కిరణ్, అలైక్య దంపతులు, విశ్రాంత ఉద్యోగులు

నాయుడుపేట టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆకుతోట వీధిలో ఉన్న విశ్రాంత ఉద్యోగుల భవనానికి విశ్రాంత అధ్యాపకుడు పేర్నాటి వెంకటేశ్వర్లు బీరువాను వితరణ చేశారు. వెంకటేశ్వర్లు సతీమణి, విశ్రాంత ఎంఈవో వేళాంగిణి జ్ఞాపకార్థంగా మంగళవారం పెన్షన్ల దినోత్సవం సందర్భంగా రూ.12 వేల విలువచేసే బీరువాను వితరణ చేశారు. కార్యక్రమంలో పేర్నాటి కిరణ్, అలైక్య దంపతులు, ఉదయశంకర్, హెచ్.సుబ్రహ్మణ్యం, కె.సుబ్రహ్మణ్యం, సుబ్రహ్మణ్యం యాదవ్, గల్లా ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

వేగ నియంత్రణకు బ్యారికేడ్ల ఏర్పాటు

సూళ్లూరుపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణం జాతీయ రహదారిపై హోలీక్రాస్ సర్కిల్ వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకొంటున్నాయి. మంగళవారం ఎస్ఐ బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో పోలీసులు జాతీయ రహదారిపై బ్యారికేడ్స్ ఏర్పాటు చేశారు. బ్యారికేడ్స్ ఏర్పాటు చేయడం వల్ల వాహనాలు నెమ్మదిగా వెళతాయని, తద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని ఎస్ఐ అన్నారు.

పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీలు



పోలీస్ స్టేషన్ వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ రమణకుమార్

చిట్టమూరు, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): గూడూరు డీఎస్పీ రమణకుమార్ మంగళవారం చిట్టమూరు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాల పురోగతిపై ఆరా తీశారు. పోలీసులు బాధ్యతగా వ్యవహరించాలని, వచ్చిన ఫిర్యాదులపై సమగ్రంగా విచారించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. అనంతరం సిబ్బందితో డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ చిన్న బలరామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్ పెన్షనర్లకు సన్మానం



బెన్నిఫిలిప్సీను సత్కరిస్తున్న పెన్షనర్స్

నాయుడుపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్స్ డే సందర్భంగా మంగళవారం సీనియర్ పెన్షనర్ బెన్నిఫిలిప్స్(94)ను స్థానిక బేరిపేటలోని ఆమె నివాసంలో ఆ అసోసియేషన్ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు ఉదయశంకర్, పేర్నాటి వెంకటేశ్వర్లు, మునగాల కృష్ణారావు, కాలేషా, హెచ్.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ షర్మిల జన్మదిన వేడుకలు

సూళ్లూరుపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జన్మదిన వేడుకలను మంగళవారం సూళ్లూరుపేటలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద కాంగ్రెస్ నాయకుడు వెంకటాచలపతి ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. అంతకుముందు షర్మిల చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బద్దెపూడి రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం

● ఎమ్మెల్యే ఆదిమూలం


కాటూరులో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. మండలంలోని కాటూరులో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ భూ సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడడం చూసిన సీఎం చంద్రబాబు రెవెన్యూ సదస్సుల పేరిట ప్రజల వద్దకు పాలన తీసుకువచ్చారన్నారు. సమస్యలు 45 రోజుల్లో పరిష్కారమవుతాయన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కన్నయ్య నాయుడు, నాయకులు మధునాయుడు, మునిచంద్ర నాయుడు, దయానాయుడు, శశియాదవ్, బట్టా గిరిష్ యాదవ్, శరత్‌కుమార్ శ్రీనివాసులు, రామనాథం, ఎంపీటీసీ రవి, సర్పంచ్ చిరంజీవి, తహసీల్దార్ సుబ్రమణ్యం, ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు, ఎస్‌ఐ విశ్వనాథ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించడానికే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని తొట్టంబేడు తహసీల్దారు మధుసూదన్‌రావు తెలిపారు. మంగళవారం చేమూరులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రజలు వివిధ భూసమస్యలపై వినతులు అందజేశారు. శ్రీకాళహస్తి మండలంలో ఉడమలపాడు, కమ్మకొత్తూరులో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో తహసీల్దారు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: మండలంలోని మన్నసముద్రంలో జరిగిన రెవెన్యూ సదస్సులో 80 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి, నాయకులు సుధాకర్, సదాశంకర్‌నాయుడు, తహసీల్దారు భార్గవి, డీటీ రోజారమణి తదితరులు పాల్గొన్నారు.

మా కడుపులు కొట్టొద్దు

మున్సిపల్ కార్యాలయం వద్ద చిరువ్యాపారుల నిరసన


నిరసన తెలుపుతున్న చిరు వ్యాపారులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రత్యామ్నాయం చూపకుండా తమ కడుపు కొట్టడం తగదని కూరగాయల మార్కెట్‌లోని చిరువ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కూరగాయల మార్కెట్‌వీధిలో చిరువ్యాపారులు తమ దుకాణాలకు అర్ధాంతరంగా విద్యుత్ కనెక్షన్లను తొలగించారంటూ మంగళవారం పురపాలకసంఘ కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కూరగాయల మార్కెట్ వీధిలోని మురుగు కాలువపై 30ఏళ్లగా బంకులు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. ఇటీవల ట్రాఫిక్ సమస్య పేరుతో తమను ఖాళీ చేయాల్సిందిగా అధికారులు ఆదేశించారని తెలిపారు. తమకు ప్రత్యామ్నాయం చూపి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశామన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాటు కోసం అధికారులు స్థల పరిశీలన చేస్తున్నామని గత కొద్దిరోజులుగా చెబుతున్నారన్నారు. అయితే సోమవారం తమకు ఎలాంటి ప్రత్యామ్నాయం చూపకుండానే విద్యుత్ కనెక్షన్లు తొలగించడం బాధాకరమన్నారు.

కూలీలను విధుల్లోకి తీసుకోండి...

పురపాలకసంఘ పరిధిలో నిలిపివేసిన దినసరి కూలీలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. మంగళవారం పురపాలకసంఘ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాన్ మాట్లాడుతూ... కరోనా సమయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కొంతమందిని విధుల్లోకి తీసుకున్నారన్నారు. అయితే వారిని నిలిపివేశారన్నారు. అంతేకాకుండా నాలుగు నెలలుగా జీతాలివ్వడం లేదన్నారు. వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోకవర్గ కార్యదర్శి మణి, జె.గురవయ్య, నరసింహులు, గోపి, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళా పారిశ్రామికవేత్తగా ఎదగాలి

పిచ్చాటూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళను ఔత్సాహిక పారిశ్రామికవేత్తగా తయారు కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని డీఆర్‌డీఏ పీడీ టి.ఎస్.శోభన్‌బాబు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో పిచ్చాటూరు, నాగలాపురం మండలాల మహిళా సమైక్యలు, వెలుగు అధికారులు, వీవోలతో పీడీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా మహిళా సంఘాలను ఏ గ్రేడ్‌లోకి తీసుకురావాలన్నారు. బ్యాంకు లింకేజీ, శ్రీనిధితో పీఎంఈజీపీ వంటి రుణాలు పొందవచ్చన్నారు. డ్వాక్రా సంఘాలు తయారు చేసిన వస్తువులకు ఆన్‌లైన్ మార్కెటింగ్ సదుపాయం ఉందన్నారు. లింగ వివక్షను రూపుమాపేందుకు పటిష్ఠ చర్యలతో ముందుకెళ్లాలన్నారు. అనంతరం ర్యాలీలో నిర్వహించారు. ఎంపీడీవో మహ్మద్ రఫీ, వెలుగు అధికారులు విజయ, చంద్రకళ, వాసు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నూతన తరగతి గది ప్రారంభం


గదిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

వరదయ్యపాళెం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవర్ధనపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే ఆదిమూలం నూతన తరగతి గదిని ప్రారంభించారు. బీజేపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్, కేబీజీ అధినేత కేబీ గురుదేవ్ తన తండ్రి బాలగురవప్ప శెట్టి 105వ జయంతి సందర్భంగా రూ.1.5లక్షలతో గదిని మరమ్మతులు చేయించారు. అనంతరం జాతీయ స్థాయి టెన్నిస్, వాలీబాల్ జట్లకు ఎంపికైన విద్యార్థులు మోహన్‌కృష్ణ, ఆకాష్‌ను అభినందించారు. ఇక శుభదిన్ భోజన్ కార్యక్రమంలో భాగంగా కేబీ గురుదేవ్ ఆధ్వర్యంలో గోవర్ధనపురం ఉన్నత పాఠశాల, సీఎల్ఎన్‌పల్లి, చావలి, మిట్ట హరిజనవాడ, పలు అంగన్‌వాడీలకు స్వీట్లు, అరటిపండ్లను అందజేశారు. టీడీపీ నాయకులు నిర్మల్, కరుణాకర్‌నాయుడు, ఆణిముత్యం నందకిషోర్‌రెడ్డి, జయశంకర్‌రెడ్డి, బీజేపీ, జనసేన నాయకులు, పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ ఉదయ్‌కుమార్, ఎంఈవో సరస్వతి, ఎంపీడీవో ప్రసాద్, డీటీ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు

రేణిగుంట డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లూథరన్ చర్చిలో రాస్ ఆధ్వర్యంలో మంగళవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమం ఫాదర్ విక్టర్, రాస్ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజు పాల్గొన్నారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు, చేతి కర్రలు అందజేశారు.

ఖాళీ డబ్బాల 'అతిథి' గృహం


త్రినేత్ర అతిథి గృహంలో ఖాళీ డబ్బాలు

శ్రీకాళహస్తి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని త్రినేత్ర అతిథిగృహం ఖాళీ డబ్బాలకు కేంద్రంగా మారడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముక్కంటి ఆలయంలోని త్రినేత్ర అతిథి గృహంలో అధికారులు ఖాళీ నెయ్యి, వంట నూనె డబ్బాలను నిల్వ చేశారు. భక్తులకు వసతి గదులు కొరత ఉంది. అయితే అతిథి గృహాల్లో డబ్బాలను నిల్వ చేస్తూ భక్తులకు గదులు లేకుండా చేస్తున్నారంటూ కొందరు సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరం వ్యక్తం చేశారు. దీని వల్ల భక్తులకు అసౌకర్యం కలగడంతో పాటు ఆలయ ఆదాయం తగ్గుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా ముక్కంటి ఆలయ అధికారుల తీరుపై ప్రతిరోజు ఏదో ఒక అంశంపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి.

దుస్థితిలో గ్రామీణ రోడ్లు



పిచ్చాటూరు మండలంలోని ప్రధాన రహదారుల లింక్‌రోడ్లు బురదమయంగా మారాయి. వీటికి మరమ్మతులు చెయ్యాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కనీసం నడవడానికి సాధ్యం కావడం లేదంటున్నారు గ్రామీణులు. కొన్ని గ్రామాల్లో ప్రధాన వీధులు బురదగుంటలుగా మారి కాలు బయట పెట్టలేని పరిస్థితి నెలకొంది. ఈ రహదారులను సిమెంటు రోడ్లుగా మార్చడం దేవుడెరుగు... సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు యుద్ధప్రాతిపదికన తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలని గ్రామీణులు కోరుతున్నారు.

\- పిచ్చాటూరు, ఆంధ్రజ్యోతి


దుస్థితిలో కొత్త గొల్లకండ్రిగ-టీకే పురం రోడ్డు

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి

సర్వ సభ్య సమావేశంలో సమస్యలను లేవనెత్తిన సభ్యులు


రోడ్ల దుస్థితిపై అధికారులతో మాట్లాడుతున్న సర్పంచు రవిరెడ్డి

సత్యవేడు, డిసెంబరు 17 ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నేరి వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలను నివారించాలని దాసుకుప్పం సర్పంచు రవిరెడ్డి విన్నవించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ప్రతిమ ఆధ్వర్యంలో సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు సమస్యలను సభ్యులు లేవనెత్తారు. సబ్ స్టేషన్ నుంచి తమిళనాడు సరిహద్దు వరకు మెయిన్ రోడ్డుకు ఆనుకుని ఉన్న స్థలాలను ఆక్రమించుకున్నారని పేర్కొన్నారు. అంగన్‌వాడీ భవన నిర్మాణాలను స్థానికేతరులకు అప్పగించడంపై ఐసీడీఎస్ అధికారులను నిలదీశారు. సత్యవేడు నుంచి ఊత్తుకోట వరకు రోడ్డు మరమ్మతులకు రూ.15లక్షలు మంజూరైందని వర్షాలు ఆగగానే పనులు ప్రారంభిస్తామని ఏఈ ఇబ్రాయిల్ తెలిపారు. ఎంఈవో రవి మాట్లాడుతూ... సుదూర ప్రాంతాల నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థులకు రవాణా చార్జీలను ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. 75 శాతం హాజరుంటేనే తల్లికి వందనం పథకంలో రూ.15వేలు జమ అవుతుందన్నారు. అమాసరెడ్డి కండ్రిగలో పంచాయతీరాజ్ నిధులతో ఉన్న రోడ్డును తవ్వి కంకర వేసి పనులను ఆపేసినట్లు జడ్పీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి ఇంజనీర్ ఇబ్రహిం ఖాన్ దృష్టికి తెచ్చారు. దీనిపై చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఎంపీడీవో చంద్రశేఖర్, తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ఉపాధి ఏపీవో కృష్ణయ్య, వైద్యాధికారి గుణశేఖర్, ఇరిగేషన్ ఏఈ ప్రభాకర్‌రెడ్డి, వెలుగు కోఆర్డినేటర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయడం నేరమని బాల్య వివాహాల వ్యతిరేక పోరాట సమితి నిర్వాహకులు పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట 'బాల్య వివాహాలను అరికడదాం బాలల జీవితాలు కాపాడుదాం' పోస్టర్లును తహసీల్దార్ సుబ్రమణ్యం, ఎస్‌ఐ విశ్వనాథ నాయుడు, ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు, బాల్య వివాహాల వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ చందమామల కోటయ్య తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. బాలికలకు 18, బాలురకు 21 సంవత్సరాలు నిండిన తరువాతనే వివాహం చేయాలన్నారు. ప్రజా ప్రగతి ట్రస్టు కోఆర్డినేటర్ సుబ్రమణ్యం, వెలుగు ఏపీఎం మునెయ్య పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు భగవద్గీత అందజేత

శ్రీకాళహస్తి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడిని ఆయన స్వగృహంలో ఇస్కాన్ భక్త బృందం మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఆయన్ను సత్కరించి భగవద్గీతను అందజేసింది. ఈ సందర్భంగా భగవద్గీత విశిష్టతను ఎస్సీవీ వివరించారు. సుబ్రహ్మణ్యంనాయుడు, హరిబాబునాయుడు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధిపై శిక్షణ

నారాయణవనం, డిసెంబర్ 17(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు స్థిరమైన అభివృద్ధి, లక్ష్యాల స్థానికీకరణపై అవగాహన కలిగి ఉండాలని ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి జుబేదా, ఎంపీడీవో శేఖర్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ ఆధ్వర్యంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సర్పంచులకు, ఎంపీటీసీ సభ్యులకు, కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి రెండు రోజుల శిక్షణను ప్రారంభించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ కర్తవ్యాలను సక్రమంగా నిర్వర్తించుకోవాలన్నారు. అనంతరం గ్రామాల వారీగా అభివృద్ధి పనుల వివరాలను తెలిపారు.

సాగు నీటి సంఘం చైర్మన్‌కు సన్మానం



బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంచనపుత్తూరు సాగు నీటి సంఘం చైర్మన్ తిరుపాలును బీఎన్ కండ్రిగ పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు సుధాకర్ నాయుడు ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, భాస్కర్ యాదవ్, గోవర్ధన్, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మండలంలో సమస్యలను పరిష్కరించండి

కేవీబీపురం డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలో సమస్యలను పరిష్కరించాలని టీడీపీ రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి మునస్వామియాదవ్ కోరారు. మంగళవారం సత్యవేడు నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీపతిబాబు, ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ సీనియర్ నాయకుడు గంగాప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మునస్వామియాదవ్ మాట్లాడుతూ మండలంలో పార్టీని నమ్ముకుని కష్టపడి పనిచేసిన వారికి కొంతమంది నాయకులు గుర్తింపు లేకుండా చేస్తున్నారన్నారు. ఇటీవల సాగునీటి సంఘ ఎన్నికల్లో ఎన్నో మలుపులు తిరిగితే కానీ 26 స్థానాలను కైవసం చేసుకోలేకపోయామన్నారు. ఈ కార్యక్రమంలో తిమ్మసముద్రం సర్పంచు దొరబాబునాయుడు, ఓళ్లూరు సర్పంచు సురేష్, నీటి సంఘ అధ్యక్షుడు శివయ్యనాయుడు, బాబుశెట్టి, గోపి, దేశయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో సినీనటి జయలలిత



శ్రీకాళహస్తి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని మంగళవారం సినీనటి జయలలిత కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్వో రవి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా షర్మిల జన్మదిన వేడుకలు

శ్రీకాళహస్తి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల జన్మదిన వేడుకలను మంగళవారం ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి టి.దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ.. షర్మిల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవం సంతరించుకుంటుదన్నారు. ఆమె ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతోందన్నారు. నవీన్, ధనకుమార్, కరీముల్లా, అన్సర్, మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు: పట్టణంలో మంగళవారం పీసీసీ చీఫ్ షర్మిల జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాలగురవంబబాబు ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు గాంధీ విగ్రహం నుంచి రెవెన్యూ కార్యాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వచ్చారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆ పార్టీ జెండాను ఆవిష్కరించి అంబేడ్కర్ విగ్రహానికి పూమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం షర్మిల జన్మదిన వేడుకల సందర్భంగా కేకును కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు శేఖర్, జాయింట్ సెకరట్రీ సురేష్, చిన్నదురై, గురవయ్య, వినోద్, సముద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మెనూ పాటించరా?

ఏకలవ్య అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం


అన్నాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమనంబేడులోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో మెనూ పాటించకపోవడంపై ఎమ్మెల్యే ఆదిమూలం ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం గురుకుల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ రోజు ఆకు కూర వడ్డించాల్సి ఉండగా పప్పుకూర ఎందుకు వండారని ప్రశ్నించారు. ప్రభుత్వం నాణ్యమైన భోజనాలు కోసం నిధులు ఇస్తుంటే మెనూ పాటించకపోవడం పై మండిపడ్డారు. ప్రిన్సిపాల్, వార్డెన్ తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. మండల స్థాయి అధికారులు మెనూపై పర్యవేక్షించాలని కోరారు. ప్రతివారం తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్‌ఐలు పరిశీలించి సమస్యలు లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కన్నయ్య నాయుడు, నాయకులు మధునాయుడు, మునిచంద్రనాయుడు, దయా నాయుడు, కార్తిక్‌నాయుడు, గిరిష్ యాదవ్, ఎస్‌ఐ విశ్వనాథ నాయుడు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో గుడిసె దగ్ధం



రేణిగుంట డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదంలో ఓ గుడిసె దగ్ధమైంది. మండలంలోని చైతన్యపురంలో గుడిసేలో కాపురం ఉంటున్న వెంకటరామయ్య కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తుంటాడు. పిల్లలు బడికి వెళ్లగా, భార్య తిరుపతికి వెళ్లింది. అదే సమయంలో ప్రమాదవశాత్తు ఇంటి లోపల నిప్పు అంటుకొని గుడిసే దగ్ధమైంది. గృహోపకరణాలు కాలి బూడిదయ్యాయి.

నిత్య భజనలు పునఃప్రారంభం


భజనలు చేస్తున్న కళాకారులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని రెండో గేటు సమీపంలో శివనామ సంకీర్తన నిత్య భజనల కార్య క్రమాన్ని పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా నిత్య భజనల కార్యక్రమాల నిర్వాహకులు సంకాంత్రి వెంకటయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే సుధీర్, ఈవో బాపిరెడ్డి సహకారంతో ఈ కార్యక్రమం పునఃప్రారంభించడం హర్షణీయమన్నారు. భజన కళాకారులకు స్వామిఅమ్మవార్ల శీఘ్ర దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేయాలని కోరారు.

వేదనారాయణుడి సేవలో డీఆర్‌డీఏ పీడీ


పీడీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నాగలాపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి చెందిన వేదవల్లి సమేత వేదనారాయణస్వామి ఆలయాన్ని మంగళవారం డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు సందర్శించారు. ఆలయ అర్చకులు ఆలయంలో ప్రత్యేక దర్శన ఏర్పాట్లు కల్పించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కాగా నాగలాపురంలో వెలుగు కార్యాలయానికి సొంత భవనం కోసం స్థానిక నాయకులు పీడీకి వినతి సమర్పించారు. స్థలం గుర్తిస్తే భవన నిర్మాణానికి సిఫార్సు చేస్తామని చెప్పారు. ఈ కారక్రమంలో ఏపీఎం సీతారామయ్య, టీడీపీ నాయకులు శ్రీనివాస యాదవ్, విజయకుమార్, పార్తిబన్, జాన్సన్, రాజశేఖర్ యాదవ్, ఎండీ కుమార్, అన్బు, నెల్సన్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ క్యాన్సర్ శిబిరం

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటూరులో క్యాన్సర్ నిర్ధారణ ఉచిత పరీక్షలు నిర్వహించారు. స్విమ్స్ శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. పింక్ బస్సుల్లో మహిళలకు పురుషులకు నోరు, మహిళలకు రొమ్ము, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. డాక్టర్లు దివాకర్, విద్యాసాగర్, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తును ఆదా చేయండి

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ విద్యుత్‌ను ఆదా చేస్తే భవిష్యత్తు తరాలు అంధకారంలోకి వెళ్లవని ట్రాన్స్‌కో ఏఈ చలపతి అన్నారు. మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో జాతీయ విద్యుత్ పొదుపు వారోత్సవాల సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 3 స్టార్ అంతకంటే ఎక్కువ స్టార్ ఉండే గృహోపకరణాలు వినియోగిస్తే బిల్లులు తక్కువగా వస్తాయన్నారు. తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి


సభ్యత్వ నమోదులో సుమన్ తదితరులు

నారాయణవనం, డిసెంబర్ 17(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, పలు అభివృద్ధి ప్రణాళికలతో సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని నారాయణవనం జడ్పీటీసీ సభ్యుడు సుమన్‌కుమార్ అన్నారు. మంగళవారం నారాయణవనంలోని సాలివీధిలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అచ్చుకట్ల హరి ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. సభ్యత్వ నమోదును వంద శాతం పూర్తి చేయాలని ఆయన నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆర్‌డీ ఏకాంబరం, భాస్కరన్, మాణిక్యంరెడ్డి, కేఎస్.రవి, గోవిందస్వామి, కేశవులు, మోహన్‌బాబు, మునిబాబు, రాము, కృష్ణ, సొరకాయలు తదితరులు పాల్గొన్నారు.